అనధికారిక ఆర్ఐలు..!





కర్నూలు కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో గ్రేడ్-1 వీఆర్వోలు అనధికారికంగా మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లుగా చలామణి అవుతున్నారు. ప్రభుత్వం జీవో.నెం.154 ప్రకారం గ్రేడ్-1 వీఆర్వోలకు 2021 సంవత్సరంలో సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు జిల్లాలో 50 మంది పదోన్నతులు పొందారు. సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందిన వారు 154 జీవోలోని రూల్ నెంబర్-4(సీ) ప్రకారం సీపీటీ, సర్వే పరీక్షలను రెండు సంవత్సరాలలోపు ఖచ్చితంగా ఉత్తీర్ణత పొందాలి. ఉత్తీర్ణత సాధించని రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్లు తిరిగి యథాస్థానంగా గ్రేడ్-1 వీఆర్వోలుగా కొనసాగాలి.

జిల్లాలో దాదాపు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీపీటీ, సర్వే పరీక్షలు ఉత్తీర్ణత కాని మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు 30 మంది ఉన్నారు. వీరికి రెవెన్యూ శాఖలోని అధికారుల అండదండలు ఉండటంతో నేటికీ తహసీల్దార్ కార్యాలయంలో మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ హోదాలో కొనసాగుతుండటం కొసమెరుపు. వీరు తహసీల్దార్ కార్యాలయంలో రూల్స్‌కు విరుద్ధంగా రైతుల భూముల విషయాలలో సంతకాలు చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు ప్రశ్నించక పోవడంతో అనధికారిక రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ల ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఉత్తీర్ణత సాధించని మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లను తొలగిస్తే జిల్లాలోని సీపీటీ, సర్వే పరీక్షలు ఉత్తీర్ణత పొందిన కింది స్థాయి గ్రేడ్-1 వీఆర్వోలకు పదోన్నతులు లభించే అవకాశం ఉంది.



రేషనలైజేషన్‌లో భాగంగా ఇటీవల గ్రేడ్-2 వీఆర్వోలను 30 మందిని ఆదోని డివిజన్‌కు బదిలీ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 380 మంది మిగులు వీఆర్వోలుగా గుర్తించారు. ఈ క్రమంలో మళ్లీ రెవెన్యూ అధికారులు 150 మంది గ్రేడ్-2 వీఆర్వోలకు పదోన్నతులు కల్పించేందుకు ఫైల్ సిద్ధం చేశారు. రెండు నెలల్లో వీరికి పదోన్నతి కల్పించి బదిలీ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. కానీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 380 మంది వీఆర్వోలు పదోన్నతుల వీఆర్వోలకు పోస్టింగులు ఎక్కడ ఇస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

- సీపీటీ సర్వే పరీక్ష ఉత్తీర్ణత కానీ 50 మంది సీనియర్ అసిస్టెంట్లు
- మున్సిపాలిటీలలో విధులు నిర్వహించని గ్రేడ్-1 వీఆర్వోలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 380 మంది మిగులు వీఆర్వోలు
- మళ్లీ గ్రేడ్-2 వీఆర్వోల పదోన్నతుల ఫైల్ సిద్ధం

సీపీటీ సర్వేలో ఉత్తీర్ణత తప్పనిసరి



ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హత కలిగిన సీనియర్ అసిస్టెంట్లు రెండు సంవత్సరాలలోపు నిర్దేశించిన పరీక్షలు సీపీటీ, సర్వేలలో ఖచ్చితంగా ఉత్తీర్ణత సాధించాలి. లేనిపక్షంలో గ్రేడ్-1 వీఆర్వోలుగా కొనసాగుతారు. ఈ మేరకు ఉత్తీర్ణత సాధించని వారిని త్వరలో గ్రేడ్-1 వీఆర్వోలుగా పంపుతాం. జిల్లాలోని మున్సిపాలిటీలలో ఖాళీగా ఉన్న గ్రేడ్-1 వీఆర్వోలను ఖచ్చితంగా బదిలీ చేస్తాం. వీరికి మ్యాపింగ్, బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తాం.

- వెంకటనారాయణమ్మ, డీఆర్వో, నంద్యాల

ప్రభుత్వం ఇటీవల జీవోఎంఎస్.నెం.4ను విడుదల చేసింది. దీని ప్రకారం రెండు లేదా మూడు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. ఒక క్లస్టర్‌కు ఒక వీఆర్వో విధులు నిర్వహిస్తారు. మున్సిపాలిటీలలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 40 మంది గ్రేడ్-1 వీఆర్వోలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏదో ఒక సచివాలయంలో విధులు నిర్వహించకుండా ప్రతినెలా వేతనాలు తీసుకుంటూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారు. మున్సిపాలిటీలలో

విధులు నిర్వహించని వీఆర్వోలు

గ్రేడ్-2 వీఆర్వోలకు కమిషనర్ డీడీవోగా ఉంటారు. అదేవిధంగా గ్రేడ్-1 వీఆర్వోలకు సంబంధిత తహసీల్దార్ డీడీవోగా వ్యవహరిస్తారు. మున్సిపాలిటీలలో పని చేసే గ్రేడ్-1 వీఆర్వోలకు ఎలాంటి మ్యాపింగ్ గానీ, బయోమెట్రిక్ గానీ లేకపోవడంతో తహసీల్దార్ కార్యాలయాలకు హాజరుకావడం లేదు.



పరిశ్రమల స్థాపనకు వేగంగా అనుమతులు : కలెక్టర్



కర్నూలు కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనకు వీలుగా ఆయా శాఖలు నిర్దేశించిన గడువులోపు అనుమతులను వేగంగా మంజూరు చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా మే 30వ తేదీ నుంచి జూలై 30వ తేదీ వరకు 870 దరఖాస్తులు రాగా, 858 దరఖాస్తులను ఆమోదించామన్నారు. మిగిలిన 12 దరఖాస్తులకు కూడా గడువులోపు అనుమతులను మంజూరు చేయాలన్నారు. పీఎం విశ్వకర్మకు సంబంధించి 1,234 దరఖాస్తులు మంజూరు కాగా, ఇందులో 989 యూనిట్లకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు నీటి సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.

పారిశ్రామిక ప్రోత్సాహకాలకు ఆమోదం:

పరిశ్రమలకు ప్రోత్సాహకాల్లో భాగంగా 12 క్లెయిమ్‌లకు రూ.26.22,000కు ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా పెట్టుబడి రాయితీ కింద 12 క్లెయిమ్స్‌కు రూ.26,22,398 పారిశ్రామిక ప్రోత్సాహకాల కింద ఆమోదం తెలిపారు. కేటగిరీల వారిగా జనరల్ కేటగిరీలకు 10, ఎస్సీలకు 2, మొత్తంగా 12 మందికి ప్రోత్సాహకాలు మంజూరు చేశామని కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం జవహర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శిశువులకు ఆధార్ నమోదు తప్పనిసరి

కర్నూలు కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పుట్టిన ప్రతి శిశువుకు ఆధార్ నమోదు తప్పనిసరిగా చేయించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమైన ప్రసూతి ఆసుపత్రులలో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసి పుట్టిన శిశువుల ఆధార్ నమోదు తప్పనిసరిగా చేయాలని అధికారులను ఆదేశించారు. 5 నుంచి 15 సంవత్సరాల మధ్య ఉన్న పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్ తప్పనిసరిగా చేయాలన్నారు. పాఠశాలల్లో పిల్లలకు ఆధార్ అప్‌డేషన్‌పై అవగాహన కల్పించి వారికి ప్రత్యేక క్యాంపులు నిర్వహించి బయోమెట్రిక్ చేయించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. కోసిగి, కర్నూలు అర్బన్ మండలాల్లో కొన్ని నకిలీ జనన సర్టిఫికెట్లు జారీ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయని వాటిపై విచారణ చేపట్టాలని డీఆర్వో వెంకటనారాయణమ్మను ఆదేశించారు. ఈ సమావేశంలో జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్ర దరఖాస్తుకు గడువు పెంపు



మాట్లాడుతున్న హజ్ కమిటీ సభ్యుడు

కర్నూలు అర్బన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ముస్లింల పవిత్ర ప్రదేశం హజ్‌కు వెళ్లేందుకు దరఖాస్తు గడువును ఆగస్టు ఏడో తేదీ వరకు పొడిగించినట్లు రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు నూరి మన్సూర్ ఆలీఖాన్ తెలిపారు. గురువారం సాయంత్రం నగరంలోని మంత్రి టీజీ భరత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హజ్ యాత్రకు వెళ్లేవారు విజయవాడ ఎంబార్కేషన్ సెంటర్‌ను మొదటి ప్రాధాన్యతగా ఎంచుకుని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విజయవాడ ఎంబారేష్కన్ కేంద్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేస్తుందని తెలిపారు. ముస్లిం, మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు.

రైతు సంక్షేమమే ధ్యేయం


హంద్రీ-నీవా జలాలకు సారెను సమర్పిస్తున్న ఎమ్మెల్యేలు

- ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు
- కొత్తపల్లిలో హంద్రీ-నీవా నీటి విడుదల

మద్దికెర, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం మద్దికెర మండలంలోని ఎడవలి, కొత్తపల్లి గ్రామాల మధ్యన 141వ తూము ద్వారా హంద్రీనీవా నీటిని కాలువలకు విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి కేఈ శ్యాంబాబుతో పాటు, గుంతకల్లు ఎమ్మెల్యే జి.జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డిలు హాజరయ్యారు. ముందుగా హంద్రీనీవా జలాలకు సారెను సమర్పించి గంగపూజ, జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ కాలువ తూము ద్వారా నీటిని విడుదల చేయడంతో పది గ్రామాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హంద్రీనీవా కాలువను వెడల్పు చేయడమే కాకుండా నీటిని కూడా ఎక్కువగా వదలడంతో ఈ ప్రాంతమంతా పంటలతో కళకళలాడుతున్నాయన్నారు. ఆగస్టు రెండో తేదీన అన్నదాత సుఖీభవ పథకం రైతులకు అందుతుందన్నారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలోని మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణం పథకం అమలు కానుందని తెలిపారు. హంద్రీనీవా జలాలు పత్తికొండ తాలుకాతో పాటు గుంతకల్లుకు చేరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉప్పరి రంగయ్య, ఆకుల వేణుగోపాల్, హుశేన్‌పీరా తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పీడీగా విజయ



కర్నూలు హాస్పిటల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ (ఐసీడీఎస్) ప్రాజెక్టు డైరెక్టర్‌గా పి.విజయ నియమితులయ్యారు. ఏపీ టూరిజం ఆఫీసర్‌గా పని చేస్తున్న ఆమెను కర్నూలు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమిస్తూ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి గురువారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న జి.నిర్మల గురువారం పదవీ విరమణ పొందారు. ఆమె స్థానంలో రెగ్యులర్ ఐసీడీఎస్ పీడీగా పి.విజయను నియమించారు. గతంలో ఆమె ఐసీడీఎస్ అసిస్టెంట్ పీడీగా పనిచేశారు.

విద్యార్థి దశ ఎంతో కీలకమైనది


సీటు అలాట్‌మెంట్ పత్రాన్ని అందజేస్తున్న రిజిస్ట్రార్

- క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు

కర్నూలు అర్బన్, జూలై 31 (ఆంధ్రజోతి): జీవితంలో ఎదిగేందుకు విద్యార్థి దశ ఎంతో కీలకమైనది క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం సిల్వర్ జూబ్లీ కళాశాలలో రెండో రోజు సిల్వర్ సెట్ కౌన్సెలింగ్‌ను ఆయన ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ సమయం ఎంతో విలువైందని, సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం సిల్వర్ సెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సీటు అలాట్‌మెంట్ పత్రాలను అందజేశారు. సెట్ కన్వీనరు వాయిజ్ మాట్లాడుతూ రెండో రోజు 300 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారని, మ్యాథ్స్‌లో 27, ఫిజిక్స్ 27, కంప్యూటర్ సైన్సు 44, కెమిస్ట్రీ 16 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బీఆర్ ప్రసాదరెడ్డి, డీన్ నాగరాజ శెట్టి, అధ్యాపకులు ఓబులేసు, రాజశేఖర్, నరేంద్ర పాల్గొన్నారు.

తుంగభద్ర నదిలో తగ్గిన నీటిమట్టం


మంత్రాలయం వద్ద తగ్గుతూ ప్రవహిస్తున్న తుంగభద్ర నది

మంత్రాలయం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నడుమ ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలో వరద తగ్గుముఖం పట్టింది. హోస్పెట్‌లోని లోని టీబీ డ్యాం నుంచి 4 గేట్లను ఎత్తి 22,077 క్యూసెక్కుల నీటిని దిగువనున్న తుంగభద్ర నదికి విడుదల చేశారు. దీంతో మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం వద్ద గురువారం సాయంత్రం 339.56 మీటర్ల నీటి మట్టంతో 58,200 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. టీబీ డ్యాం నుంచి నాలుగు గేట్ల ద్వారా వరద ప్రవాహాన్ని తగ్గించి దిగువకు నీటిని విడుదల చేశారు. డ్యాంలోకి ఇన్‌ఫ్లో 42,879 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఇప్పటికే తుంగభద్ర నది రెండువైపులా సరిహద్దులను తాకుతూ ప్రవహిస్తుంది. మంత్రాలయం వద్ద నీటి మట్టం పూర్తి స్థాయిలో తగ్గుముఖం పట్టడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

అమ్మపాలు అమృతం
6
చేనేత రంగాన్ని కాపాడండి
- ప్రభుత్వాలు చొరవ చూపాలి
- చేనేత పరిరక్షణ సదస్సులో నాయకులు

అడంగల్‌లో పేరు మార్పునకు రూ.50 వేలు లంచం

- ఏసీబీకి చిక్కిన ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రమేష్
- రైతు నుంచి రూ.70వేలు డిమాండ్


రమేష్

జూపాడుబంగ్లా, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వేల రూపాయల వేతనం అందుకుంటున్నా కొందరి అధికారులకు సరిపోవడం లేదు. అధికంగా ఆదాయాన్ని సంపాదించేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. అందుకోసం 'లంచం' అనే మార్గాన్ని ఎంచుకుని కటకటాలపాలవుతున్నారు. నిత్యం ఎక్కడో ఒకచోట లంచాలు తీసుకుంటూ అధికారులు ఏసీబీకి పట్టుబడుతూనే ఉన్నారు. తాజాగా గురువారం ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెట్‌గా పనిచేస్తున్న రమేష్ అడంగల్‌లో పేరు మార్పు చేసేందుకు రైతు నుంచి రూ.40వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. జూపాడుబంగ్లా గ్రామానికి చెందిన రైతు ఈశ్వరయ్య తన తల్లి శంకరమ్మ పేరుమీద 80బన్నూరు పొలిమేరలోని సర్వేనంబరులో 568-ఏలో 70సెంట్లు, 568-సీలో 30సెంట్లు మొత్తం ఎకరా పొలం ఉంది. అనుభవంలో శంకరమ్మ ఉన్నా కూడా అదే సర్వే నంబరుకు చెందిన లింగన్న అనే రైతు పొలాన్ని డబుల్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆన్‌లైన్ అడంగల్‌లో లింగన్న పేరు తీసేయాలని రెవెన్యూ అధికారులను ఆశ్రయించాడు. అయితే ఆర్డీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రమేష్ సదరు రైతు నుంచి రూ.70వేలు లంచం డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేనన్న రైతు 50 వేలకు బేరం కుదుర్చుకున్నాడు. ముందుగా రూ.10వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. తర్వాత జూపాడుబంగ్లాకు వస్తే రూ.40వేలు ఇస్తానని రైతు ఈశ్వరయ్య చెప్పడంతో రమేష్ గురువారం ఉదయం అక్కడకు వచ్చాడు. ఈ క్రమంలో ముందుగానే ఏసీబీ అధికారులు సమకూర్చిన రూ.40వేల డబ్బును తీసుకెళ్లిన రైతు... కేజీ రోడ్డులోని ఓ కారులో ఉన్న రమేష్‌కు అందించాడు. అప్పటికే అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు సదరు అధికారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సోమన్న మాట్లాడుతూ లంచం వ్యవహారం వెనుక ఎవరెవరు ఉన్నారన్నది విచారిస్తున్నామన్నారు. రైతు ఈశ్వరయ్య మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి ఆన్‌లైన్ అడంగల్‌లో ఉన్న లింగన్న పేరు తీసేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నానన్నారు. ఏడాది క్రితం తన తల్లి శంకరమ్మ కూడా చనిపోవడంతో తన పేరుమీద మార్చాలని తిరిగానన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్వోఆర్‌లో మార్చుకోవాలని జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయంలో చెప్పడంతో ఆర్డీఓను కలిశారు. ఈ విషయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రమేష్ రూ.70వేలు డబ్బులు డిమాండ్ చేయగా రూ.50 వేలకు బేరం కుదరిందని, జూలై 23న రూ.10వేలు అడ్వాన్సుగా ఇచ్చానని తెలిపారు. ఈ దాడిలో సీఐలు కృష్ణయ్య, రాజప్రభాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.


సీనియర్ అసిస్టెంట్ రమేష్ వద్ద లంచం డబ్బులు స్వాధీనం చేసుకున్న ఏసీబీ డీఎస్పీ సోమన్న, సిబ్బంది

బీజేపీ జిల్లా కార్యవర్గం ఎంపిక

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా భారతీయ జనతా పార్టీ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపికైనట్లు జిల్లా అధ్యక్షుడు బి.రామకృష్ణ పరమ హంస గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులుగా జ్యోతి అనితారెడ్డి, మద్దిలేటి యాదవ్, విక్కి వెంకటేశ్వర్లు, దుమ్మా వెంకట్రాముడు, కొండా షాహిద్ భగత్, ఎర్రవట్టి వెంకటహరి, జనరల్ సెక్రటరీగా నారాయణ, నాగేశ్వరరావు, మాలతి, కార్యదర్శులుగా మద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, మధు కిషోర్, మల్లెపోగు త్రివిక్రమ్, గోరంట్ల రామాంజనేయులు, ఏజీవీ దయాసాగర్, హుశేనప్ప యాదవ్ ఎంపికయ్యారన్నారు. అదేవిధంగా పార్టీ కోశాధికారిగా చాకలి లోకేశ్వరయ్య, సోషల్ మీడియా కన్వీనర్‌గా కే.జగదీశ్వరాచారి, ఐటీ కన్వీనర్ ఎస్.నవీన్‌ను ఎంపిక చేసినట్లు వివరించారు.

వైసీపీ హయాంలో విధ్వంసం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

మద్దికెర, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం విధ్వంసమైందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి అన్నారు. గురువారం ఆయనతో పాటు పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మద్దికెరలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఇతర దేశలకు వెళ్లి పెట్టుబడులకు ఆహ్వానిస్తున్నారని గుర్తు చేశారు. వైఎస్ జగన్ రెడ్డికి ప్రజలు గత ఎన్నికల్లో 11 సీట్లు ఇచ్చినా బుద్ధి రాలేదన్నారు. పరామర్శల పేరుతో జగన్ రెడ్డి అరాచకాలు సృష్టిస్తున్నారన్నారు. కర్నూలు జిల్లాను అభివృద్ధి పథంలో కూటమి ప్రభుత్వం నడిపిస్తోందన్నారు. నకిలీ మద్యంతో వైసీపీ బడానేతలు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడారన్నారు. మద్యం కుంభకోణంలో వేల కోట్ల రూపాయలు చేతులు మారాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదికే పత్తికొండ తాలుకాలో 68 చెరువులకు నీరు వదిలామని గుర్తు చేశారు. హంద్రీనీవా కాలువ ద్వారా పులివెందుల కూడా నీరు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈడిగ చంద్రశేఖర్‌గౌడు, ఉప్పరి రంగయ్య, గూడూరు కవిత తదితరులు ఉన్నారు.

పీ-4లో పరిశ్రమలు భాగస్వామ్యం కావాలి

కర్నూలు కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పీ-4 విధానంలో పరిశ్రమల యాజమాన్యాలు భాగస్వాములు కావాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో పీ-4 విధానంపై పరిశ్రమల యాజమాన్యాలు, ఇండస్ట్రియల్ అసోసియేషన్ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ-4 విధానంలో పరిశ్రమల యజమాన్యాలు భాగస్వాములై, అత్యంత పేదలుగా గుర్తించబడిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని, వారి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. పీ-4 కార్యక్రమంలో భాగంగా నిరుపేదల అవసరాలను బట్టి సహాయం అందించవచ్చన్నారు. అలాగే సీఎస్ఆర్ కింద వెసులుబాటును చేసుకుని ఒక గ్రామాన్ని కూడా దత్తత తీసుకుని గ్రామ అభివృద్ధికి తోడ్పాటును అందించవచ్చన్నారు. ఈ సమావేశంలో సీపీవో హిమప్రభాకర్ రాజు, ఏడీ భారతి, పరిశ్రమల శాఖ జీఎం జవహర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగాన్ని కాపాడండి

● ప్రభుత్వాలు చొరవ చూపాలి

● చేనేత పరిరక్షణ సదస్సులో నాయకులు



సదస్సులో మాట్లాడుతున్న చేనేత నాయకుడు శంకరన్న

ఎమ్మిగనూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): చేనేతరంగాన్ని పట్టి పీడిస్తున్న సంక్షోభాలను పరిష్కరించి చేనేతరంగాన్ని కాపాడేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర జనచేనేత సమాఖ్య నాయకులు శంకరన్న, నీలకంఠ, నాగరాజులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని తేరుబజారులో రాష్ట్ర జనచేనేత సమాఖ్య ఆధ్వర్యంలో చేనేత పరిరక్షణ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేతకార్మికుల ప్రాణాధారమైన చిలపల నూలును చేనేతలకు అందకుండా పవర్‌లూమ్స్, మిల్లులకు సరఫరా చేయడంతో చేనేతపరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. నేత కార్మికులు ఉత్పత్తి చేసిన వస్త్రాలకు సరైన మార్కెటింగ్ లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. పెద్ద మిల్లులకు ఇచ్చే ప్రోత్సాహాలకు చేనేతకార్మికులకు ఇవ్వకపోవటం, పెరుగుతున్న నూలు, రంగులు, ముడిసరుకుల ధరలతో వాటిని కొనలేక కార్మికులు ఈ రంగాన్ని వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత రిజర్వేషన్ చట్టం 11శాతం అమలు చేయాలని, చేనేతపై జీఎస్టీని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్పోరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. అలాగే ఉచిత విద్యుత్ 200 యునిట్ల వరకు ఇవ్వాలన్నారు. చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలని, మూడు సెంట్ల స్థలం, షెడ్డు ఇవ్వాలన్నారు. పట్టణంలోని వైడబ్ల్యూసీఎస్ సభ్యులకు గతంలో ఇచ్చిన రెండు సెంట్ల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలన్నారు. ఈ సదస్సుకు పట్టణానికి చెందిన చేనేత, బీసీ, ప్రజాసంఘాల నాయకులు మాచాని రఘు, మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు, రామచంద్ర, గణేష్, ఏసేపు, ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

అమ్మపాలు అమృతం



బిడ్డకు అమ్మపాలు వరం.. సురక్షితం.. అన్ని పోషకాలు అందించి రోగాల నుంచి రక్షించే అమృతం. తల్లిపాలు తాగే పిల్లలు బలంగా, తెలివిగా ఉంటారు. శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో, రోగనిరోధక శక్తిని పొందాలంటే తల్లిపాలతోనే సాధ్యం. తల్లిపాలతో తల్లికి, బిడ్డకు లాభాలు ఉన్నాయి. తల్లి పాల విశిష్టత బిడ్డకు ఎంత వయస్సు వచ్చే వరకు తల్లిపాలు ఇవ్వాలి.. రోజుకు ఎన్నిసార్లు ఇవ్వాలి?, పాలు పుష్కలంగా రావాలంటే తల్లులు ఎలాంటి ఆహారం తినాలి..? ముర్రుపాలు ఎప్పుడు పట్టాలి..? అనే అంశాలపై అవగాహన కల్పిస్తారు. దీనికోసం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించనున్నారు. జిల్లాలో 1,886 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ వారోత్సవాలు నిర్వహించనున్నారు. జిల్లాలో20,250 మంది గర్భిణులు, 14,768 మంది బాలింతలు ఉన్నారు. వీరితో పాటు ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

కర్నూలు హాస్పిటల్ (ఆంధ్రజ్యోతి)

● పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాపించాలి

● కనీసం ఆరు నెలల దాకా పాలు పట్టిస్తేనే బిడ్డకు ఆరోగ్యం

● నేటి నుంచి ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

● జిల్లాలోని 1,886 అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహణ

మార్కెట్‌లో ఎన్నో రకాల పాల ఉత్పత్తులు లభిస్తున్నప్పటికీ తల్లిపాలకు మించిన పౌష్టికాహారం లేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం తల్లిపాల ప్రాధాన్యతను వివరిస్తూ మార్గదర్శకాలను విడుదల చేసింది. తప్పనిసరిగా పుట్టిన బిడ్డకు ముర్రుపాలతో పాటు 6 నెలల వరకు తల్లిపాలనే ఇవ్వాలని స్పష్టం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ విషయంపై ప్రచారం చేస్తున్నాయి. అయినా క్షేత్ర స్థాయిలో మాత్రం ఆశించిన మేర అమలు కావడం లేదు. ఈ నేపథ్యంలో ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ వ్యాప్తంగా తల్లి పాల వారోత్సవాలు నిర్వహించాలని ఐక్యరాజ్య సమితి సూచించింది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

బిడ్డకు పాలు ఇచ్చే సమయంలో తల్లి కొన్ని జాగ్రత్తలు పాటించాలి. బిడ్డను పడుకోబెట్టి, నిలబెట్టి పాలు పట్టకూడదు. పాలు ఇచ్చే సమయంలో కెఫిన్ అధికంగా ఉండే పదార్థాలు, శీతల పానీయాలు తీసుకోకూడదు. ఇది బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభా వం చూపుతుంది. బిడ్డ పుట్టిన మొదటి గంటలోపే తల్లి ముర్రు పాలు ఇవ్వాలి. ఇది రోగ నిరోధకశక్తిని పెంచడమే కాకుండా బిడ్డకు సమతుల్యమైన పోషకాహారం పదార్థాలు లభిస్తాయి. 6నెలల దాకా రోజూ ఎనిమిది నుంచి పదిసార్లు బిడ్డకు పాలు ఇవ్వాలి.



బిడ్డకు ప్రయోజనాలు

తల్లి పాలతో బిడ్డకు ప్రొటీన్లు అందడంతో పాటు మెదడు వికసించడంతో పాటు శిశువుకు సమతుల్యమైన ఆహారం అందుతుంది. బిడ్డకు అవసరమయ్యే విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. పాలల్లోని లాక్టోజ్ ఉండటంతో కాల్షియం నిల్వలు పెరుగుతాయి. దీంతో తొలి దశలో శిశువును అంటువ్యాధుల నుంచి కాపాడటమే కాకుండా మహా వికాసానికి తోడ్పడుతాయి. నిమోనియా, డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడవచ్చు. క్యాన్సర్, గుండెజబ్బులు నుంచి రక్షణనిస్తాయి. ఆస్తమా, ఎలర్జీ, డయాబెటిస్ వంటి వ్యాధులు ధరిచేరవు. పోషకాహారం లోపం తగ్గి, శిశు మరణాలు కూడా తగ్గే అవకాశం ఉంది.



తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తాం

తల్లిపాల ప్రాముఖ్యంపై జిల్లాలో వారం రోజుల పాటు గ్రామాలు, మండలం, జిల్లా స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. కనీసం ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు పట్టించాలి. గర్భిణులు ఇప్పుడే తల్లిపాల విశిష్టతను తెలుసుకుంటే మంచిది. ప్రతి తల్లి బిడ్డ పుట్టిన గంటలోపు పాలు ఇచ్చేలా చైతన్యం చేస్తున్నాం.

- పి.విజయ, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్, కర్నూలు



తల్లికి లాభాలు

చనుబాలు ఇవ్వడం ఇవ్వడం వల్ల డెలివరీ తర్వాత త్వరగా కోలుకుంటారు. జీవితాంతం ఆరోగ్యంగా ఉంటారు. ఊబకాయం వచ్చే ప్రమాదం తగ్గుతుంది. గర్భానికి ఉన్న పూర్వ బరువును తిరిగి పొందుతారు. రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు వచ్చే ప్రమాదం తక్కువ. తల్లిబిడ్డల మధ్య బంధం పెరుగుతుంది.



గంటలోపే బిడ్డకు ముర్రుపాలు ఇవ్వాలి

బిడ్డ పుట్టిన వెంటనే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ముర్రుపాలు ఇవ్వాలి. సిజేరియన్ అయిన కూడా బిడ్డను తప్పనిసరిగా తల్లి చెంతన పడుకోబెట్టాలి. స్కిన్ కాంటాక్టు తల్లికి బిడ్డకు ఎంతో మంచిది. తల్లి పాలు ఇవ్వడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా, చురుగ్గా ఉంటుంది. గైనిక్ విభాగంలో ప్రతి నెలలో 750 కాన్పులు జరుగుతాయి. బాలింతలకు తప్పనిసరిగా తల్లిపాల ప్రాధాన్యతను వైద్యులు, నర్సులు తప్పనిసరి తెలియజేస్తాం.

- డాక్టర్ ఎస్.సావిత్రి, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, గైనకాలజీ విభాగం, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

నమో.. నారసింహ

● గోదా గోకులంలో ఘనంగా సుదర్శన నృసింహ హోమాలు



గోదా గోకుల క్షేత్రంలో విశేష అలంకరణలో సుదర్శన స్వామి

కర్నూలు కల్చరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారు మామిదాలపాడులో వెలసిన గోదారంగనాథ స్వామి దేవస్థానం (గోదా గోకుల క్షేత్రంలో)లోని సుదర్శన స్వామి క్షేత్రంలో గురువారం ప్రత్యేక పూజా కైంకర్యాలు జరిగాయి. సుదర్శన తిరు నక్షత్రం సందర్భంగా, చిత్తానక్షత్రాన్ని పురస్కరించుకుని జరిగిన వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో సుదర్శన స్వామి వారు 16 చేతులు, 16 ఆయుధాలతో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే ఏకశిలతో నిర్మించిన మూలమూర్తి వెనుక వైపు యోగాసనంలో నరసింహ స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అలయ ప్రధాన అర్చకుడు రమేష్ భట్టార్ ఆధ్వర్యంలో ఉదయం సుదర్శన స్వామి మూలవర్లకు, ఉత్సవ వర్లకు అభిషేకములు, ఉదయం 7 గంటలకు గోష్టి, 8 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామి వారికి నిత్య కల్యాణం చేపట్టారు. అనంతరం 10 గంటలకు శ్రీ సుదర్శన నారసింహ హోమం, 27 పర్యాయాలు సుదర్శన అష్టకం పఠనం కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం 12:30 గంటలకు పూర్ణాహుతి చేసి, ఒంటి గంటలకు మధ్యాహ్న గోష్టి చేపట్టారు. రాత్రి 7 గంటలకు పల్లకీసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, ఇటిక్యాల పుల్లయ్య, బాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



పూజకు హాజరైన భక్తులు

జాతీయ రహదారిని ఏర్పాటు చేయండి



కేంద్రమంత్రులు గడ్కరి, రామ్మోహన్ నాయుడుతో ఎంపీ శబరి, ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు- కర్నూలు రహదారిని జాతీయ రహదారికి అనుసంధానించి అభివృద్ధి చేయాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరిని ఎమ్మెల్యే కలిశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, కర్నూలు, నంద్యాల ఎంపీలు నాగరాజు, బైరెడ్డి శబరిలతో కలిసి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి కేంద్రమంత్రి నితిన్ గడ్కరిని కలిసి వినతిపత్రం ఇచ్చారు.

డ్రోన్‌తో ముందుకు సాగుతున్నారు..!

● సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అన్నదాతల దృష్టి

● అస్వస్థతకు గురికాకుండా పిచికారీ

● పెట్టుబడి కూడా తక్కువే



డ్రోన్‌తో పిచికారీ చేస్తున్న రైతులు

బనగానపల్లె, జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడానికి రైతులు సమాయత్తమవుతున్నారు. కూలీలు దొరకకపోవడం, కూలీల ధరలు పెరగడం, సమయానికి కూలీలు పనికి రాకపోవడంతో రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంబిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో వేసిన పంటలకు మందుల పిచికారికి ఆధునిక డ్రోన్‌లను వినియోగిస్తూ రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రభుత్వం కూడా వ్యవసాయ ఖర్చులను తగ్గించేందుకు యాంత్రీకరణకు చేయూతనిస్తోంది. ప్రభుత్వం నూతన సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తోంది. ఇందులో భాగంగా డ్రోన్‌ల వినియోగానికి సబ్సిడీపై రైతులకు అందించడానికి సమాయాత్తమవుతోంది.

తగ్గనున్న పెట్టుబడి

రైతులు డ్రోన్‌లు మందులు పిచికారి చేయడం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గిపోనున్నాయి. నానో ఎరువుల రాకతో డ్రోన్‌ల ద్వారానే రైతులు పంట పలాల్లో పిచికారి చేస్తున్నారు. డ్రోన్‌ల ద్వారా పిచికారీ వల్ల రైతులకు పెట్టుబడులు తగ్గనున్నాయి. ఒక కూలీ పొలంలో పిచికారి చేయాలంటే ఒక మనిషికి రూ.800 నుంచి రూ.1000 కూలీ అడుగుతున్నారు. అదే డ్రోన్ ద్వారా అయితే రూ.500లకే పంట పొలాల్లో పిచికారి చేస్తున్నారు. దీని వల్ల రైతులపై కూలీల భారం తగ్గిపోతుంది.

రైతులకు చేయూతగా డ్రోన్‌లు

ఒకప్పుడు ఊరుకో ట్రాక్టర్ ఉంటే గొప్ప. నేడు పదులకొద్దీ ట్రాక్టర్లు వచ్చాయి. ట్రాక్టర్ లేకుంటే సేద్యం చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు రైతులకు డ్రోన్‌లు చేయూత నిస్తున్నాయి. పురుగుల మందులు చల్లుతూ ఊరూర విహరిస్తున్నాయి. విత్తనాలు చల్లేందుకు, చీడపీడల్ని గుర్తించేందుకు రైతుల అవసరాలను గుర్తించి ప్రముఖ ఎరువులు, పురుగుల మందుల తయరీ సంస్థలు మందుల పిచికారీ చేసేందుకు ముందుకు వస్తున్నాయి. డ్రోన్‌లు గ్రామీణ ప్రాంతాల్లో యువతకు ఉపాధినిస్తున్నాయి. యువకులు, యువ రైతులు శిక్షణ తీసుకొని అద్దెకు పురుగుమందులు డ్రోన్‌ల ద్వారా చల్లుతూ ఆదాయం పొందుతున్నారు. డ్రోన్‌లు సామర్థ్యాన్ని బట్టి రూ.6లక్షల నుంచి రూ.10లక్షల వరకు లభిస్తున్నాయి. డ్రోన్ వల్ల మొక్క అడుగు నుంచి పై వరకు తడుస్తుంది. నేలలో తేమ, చీడపీడల తీవ్రత తెలుసుకోవచ్చు.

డ్రోన్‌తో ప్రయోజనాలు

డ్రోన్ వినియోగం వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. పురుగుల మందు పిచికారి చేస్తూ రైతులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. డ్రోన్‌లతో ఆ ప్రమాదం లేదు. కూలీల సమస్య అసలు ఉండదు. శిలీంద్రనాశినులు, కలుపు నివారణ మందులు పొలంలో డ్రోన్‌ల ద్వారా చల్లుకోవచ్చు. స్ప్రేయర్లతో ఎకరాకు 200 లీటర్ల నీరు అవసరమైతే డ్రోన్‌లతో 10 లీటర్లు సరిపోతుంది. చేతిపంపుతో రైతు పిచికారికి సుమారు 6 గంటల సమయం పడుతుంది. డ్రోన్‌తో కేవలం 5,6 నిముషాల్లోనే ఎకరా పొలంలో మందు పిచికారి చేసుకోవచ్చు.



డ్రోన్ వినియోగం ఎంతో లాభదాయకం

కూలీల సమస్యను అధికమించవచ్చు. వ్యవసాయ యాంత్రీకరణలో డ్రోన్‌లు రైతులకు మేలు చేస్తున్నాయి. పురుగుల మందు పిచికారి చేయడం వల్ల అనారోగ్యం బారన పడే ప్రమాదం ఉండదు. కూలీలు స్ప్రే చేసే కంటే 30 శాతం అధికంగా మందు పంట మొక్కలకు అందుతుంది. అలాగే పురుగుల మందు వినియోగంలోలో 30శాతం పెట్టుబడి కూడా మిగులుతుంది. 50శాతం డ్రోన్‌లతో మందు, ఎరువులు పిచికారి చేస్తే సామర్థ్యం పెంచుకోవచ్చు.

- మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి

రాయితీపై డ్రోన్‌ల పంపిణీకి ఏర్పాట్లు

గతంలో వైసీపీ ప్రభుత్వంలో డ్రోన్ల పంపిణీపై నిర్లక్ష్యం చూపింది. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు సబ్సిడీపై డ్రోన్‌లు అందించేందుకు సమాయాత్తమవుతోంది. అలాగే డ్రోన్ల వినియోగంపై రైతులకు, యువతకు శిక్షణ కూడా ఇస్తోంది.



డ్రోన్

జిల్లా స్థాయి యోగా పోటీలు ప్రారంభం



యోగా పోటీలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథి

కర్నూలు స్పోర్ట్స్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నిత్యం యోగా సాధనతో అద్భుత ఫలితాలు సాధించవచ్చునని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. గురువారం నగరంలోని అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా యోగాసన చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు యోగా చేయడం వల్ల జ్ఞాపకశక్తి పెరిగి చదువుల్లో రాణిస్తారనీ తెలిపారు. యోగా వల్ల క్రమశిక్షణ పెరిగి మంచి జీవనశైలి ఏర్పడుతుందన్నారు. మైండ్ కంట్రోల్ ఉండాలంటే యోగా చేయాలన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ యోగా గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేసి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. జిల్లాలో భారీ ఎత్తున యోగా పోటీలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలు రాష్ట్రస్థాయిలో ఆగస్టు 21న విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో పోటీల అబ్జర్వర్ బాల సుబ్రహ్మణ్యం, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రామాంజనేయులు, జిల్లా యోగాసన అసోసియేషన్ అధ్యక్షుడు శివరాజ్, ఉపేంద్ర, జోసెఫ్ లక్ష్మయ్య, హర్షవర్ధన్, ప్రభాకర్, అబ్దుల్ రెహిమాన్, చిన్న సుంకన్న, గీత, సుప్రియ, దేవమణి, లీలావతి, ప్రభాకర్ యాదవ్, రంగస్వామి, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మంత్రి బీసీ



క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

దొర్నిపాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తన మానవత్వాన్ని చాటుకున్నారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ బాధితుడిని రక్షించి వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గురువారం దొర్నిపాడు మండలంలోని లక్ష్మీ రైస్‌మిల్ సమీపంలోని జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పడకండ్ల గ్రామానికి చెందిన యువకుడు ఓబులేసు ప్రమాదవశాత్తు అదుపు తప్పి కిందకు పడ్డాడు. అదేసమయంలో వెళ్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సంఘటనను చూసి వెంటనే కారు దిగాడు. తన సిబ్బంది సహాయంతో తీవ్రంగా గాయపడ్డ ఓబులేసును ఓ వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం ప్రభుత్వ వైద్యులతో మాట్లాడి గాయపడ్డ బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలన్నారు.

ఇసుక లారీ పట్టివేత

ప్యాపిలి, జూలై 31(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని మండలంలోని చిగురుమాను దగ్గర గురువారం జలదుర్గం పోలీసులు పట్టుకున్నారు. చిగురుమాను దగ్గర రోడ్డుపై పోలీసులు తనిఖీ చేస్తుండగా అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి డోన్‌కు తరలిస్తున్న లారీకి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇసుక తరలింపుపై సమగ్ర విచారణ చేస్తున్నట్లు వారు తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక లారీ

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాణ్యం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన గడివేముల మండలం కె. బొల్లవరం గ్రామానికి చెందిన జంగంరెడ్డి బాలీశ్వరరెడ్డి (54) గురువారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పాణ్యం పోలీసులు తెలిపారు. గత నెల 20 వ తేదీన కర్నూలు నుంచి నంద్యాలకు మోటారు సైకిల్‌పై వెళ్తూ నయారా పెట్రోల్ బంకు వద్ద బర్రెను తప్పించబోయి అదుపు తప్పి కిందపడడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం శాంతిరాం ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య మాలతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గుడికల్ వ్యాపారి రూ.1.25 కోట్లకు ఐపీ?

ఎమ్మిగనూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడికల్ గ్రామానికి చెందిన ఓ వ్యాపారి దాదాపు రూ.1.25 కోట్లకు ఐపీ పెట్టినట్లు సమాచారం. 11మందికి వారం రోజుల క్రితం ఐపీ నోటీసులు పంపినట్లు సమాచారం. ఓ వ్యాపారి ఓ సంస్థకు చెందిన ఏజెన్సీని తీసుకొని వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపార లావాదేవీలలో భాగంగా పలువురి వద్ద అప్పు తీసుకున్నట్లు తెలిసింది. అదే గ్రామానికి చెందిన ఓ నాయకుడి వద్ద రూ. 14 లక్షలు, ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఓ మెడికల్ దుకాణ నిర్వాహకులకు రూ. 14లక్షలతో పాటు పలువురి వద్ద అప్పు తీసుకున్నట్లు తెలిసింది. అయితే ఐపీ నోటీసులు ఇవ్వటంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులును వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని తెలిపారు.

ఆత్మకూరులో గోవుల అక్రమ రవాణా



విచారిస్తున్న సీఐ రాము

- కంటైనర్‌లో 30గోవులకు నరకయాతన
- తరలింపును అడ్డుకున్న వీహెచ్‌పీ
- పోలీసుల చొరవతో గోశాలకు తరలింపు

ఆత్మకూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఓ కంటైనర్ వాహనంలో అక్రమంగా గోవులను తరలిస్తునట్లు సమాచారం రావడంతో ఆత్మకూరు విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు అడ్డుకున్నారు. పోలీసుల సహకారంతో వాటిని సురక్షిత ప్రాంతానికి తరలించే చర్యలు చేపట్టారు. ఆత్మకూరు మండలంలోని కురుకుంద గ్రామానికి చెందిన బాషా అనే వ్యక్తి ఏలూరు జిల్లాలోని హనుమాన్ జంక్షన్‌లో సుమారు 30 గోవులను కొనుగోలు చేసి వాటిని ఆత్మకూరు మీదుగా తన స్వగ్రామానికి తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. అప్పటికే ఈ అక్రమ తరలింపుపై సమాచారం ఉండటంతో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ఆత్మకూరులోని సంగమేశ్వరం సర్కిల్‌లో వాహనాన్ని అడ్డుకున్నారు. కంటైనర్ ఎక్కి పరిశీలించగా ఏకంగా 30 గోవులను తరలిస్తున్నట్లు గుర్తించారు. అంతేకాదు గోవులను ఎక్కువ సంఖ్యలో కంటైనర్‌లో ఎక్కించడం వల్ల ఐదు గోవుల దాకా మృతిచెందినట్లు తెలిసింది. దీంతో అక్కడున్న వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అర్బన్ సీఐ రాము చేరుకున్నారు. ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా కంటైనర్‌లోని గోవులను సురక్షిత ప్రదేశానికి తరలించారు. చుట్టుపక్కల గోసంరక్షణ శాలల గురించి ఆరా తీయగా మిడ్తూరు మండలంలోని జలకనూరులో ఓ గోశాల వారు ఆ గోవులను సంరక్షిస్తామని అంగీకరించడంతో సీఐ రాము స్వయంగా అదే వాహనంలో వాటిని అక్కడికి తరలించారు. ఈయన వెంట విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు శ్రీధర్‌గుప్తా, ఆవులరెడ్డి, అంబటి సతీష్ తదితరులు వెళ్లారు.

మహిళలపై దాడులు చేస్తే కఠిన చర్యలు

- డీఎస్పీ భార్గవి
- చిన్నభోంపల్లిలో హత్యపై విచారణ



ఘటనా స్థలంలో విచారిస్తున్న డీఎస్పీ భార్గవి

కోసిగి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడులు చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మిగనూరు డీఎస్పీ ఎంఎస్ భార్గవి అన్నారు. కోసిగి మండల పరిధిలోని చిన్నభోంపల్లి గ్రామంలో భర్త దుద్ది ఈరన్నగారి నరసింహులు దాడిలో భార్య లక్ష్మి బుధవారం రాత్రి మృతి చెందింది. గురువారం డీఎస్పీ సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. అనంతరం కోసిగి పోలీస్ స్టేషన్‌లో సీఐ మంజునాథ్, ఎస్‌ఐ హనుమంతరెడ్డి సమక్షంలో విలేకరులతో మాట్లాడారు. తొలి పోస్టింగులో భాగంగా ఎమ్మిగనూరుకు వచ్చానన్నారు. కోసిగి సర్కిల్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా ఉంచి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో పార్టీలకు అతీతంగా, శాంతియుతంగా మెలగాలన్నారు.

పంటలు ఎండిపోతున్నాయ్..!

- పది రోజులుగా మరమ్మతులకు నోచుకోని ట్రాన్స్‌ఫార్మర్
- విద్యుత్ సరఫరా నిలిపివేసిన అధికారులు
- అగసనూరులో రైతుల ఆవేదన



విద్యుత్ కనెక్షన్ తొలగించడంతో అగసనూరులో ఎండిపోతున్న ఉల్లి పంట



ఆవేదన వ్యక్తం చేస్తున్న అగసనూరు రైతులు

కోసిగి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నాయి. దీనికి కారణం ఎవరు? అన్నదాతను ఆదుకుంటామన్న పాలకులా? లేక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులా? ఏది జరిగినా నష్టపోయేది మాత్రం అన్నదాతయే. మండలంలోని అగసనూరు గ్రామానికి చెందిన రైతులు శివన్న, నాగేంద్ర, మల్లేష్, విశ్వనాథ్, నాగరాజు, హనుమప్ప, పెద్దభీమన్న, కర్రెప్ప, దేవన్న తమ పొలాల్లో వేసిన పంటలు ఎడుముఖం పట్టడంతో బుధవారం 'ఆంధ్రజ్యోతి' ముందు తమ గోడును వెళ్లబోసుకున్నారు. తమ 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ పదిరోజులు క్రితం కాలిపోయిందని తెలిపారు. నాలుగు రోజుల తర్వాత ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేసి ఏర్పాటు చేసినాఓవర్‌లోడు ఉందని రైతులకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదని, దీంతో కళ్ల ముందే ఉల్లి, మిరప, వరి పంటలు ఎండు ముఖం పట్టి రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. ఎండుతున్న పంటలను చూసి తట్టుకోలేక రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. విద్యుత్ అధికారులను కనెక్షన్ ఇవ్వాలని కోరగా ఓవర్‌లోడు ఉందని, మరోసారి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోదని రాసివ్వాలని కొర్రీలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


వివరణ: ఇదే విషయంపై విద్యుత్ ఏడీ శాంతి స్వరూప్‌ను ఏఈ వీరేష్‌ను వివరణ కోరగా రైతులు తాము వాడాల్సిన విద్యుత్ కంటే అధిక లోడు బోరు మోటార్లు వాడడంతో లోడు పడిందన్నారు. అందుకే విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం లేదని చెప్పడం గమనార్హం. రైతులను ఇలా బాధపెట్టడంసరి కాదని, విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని 'ఆంధ్రజ్యోతి' అధికారులను కోరగా రైతుల కోసం నీవు హామీకత్తు ఉంటావా? ట్రాన్స్‌ఫార్మర్ మరోసారి కాలిపోకుండా హామీ కత్తు రాసిస్తే విద్యుత్ కనెక్షన్ ఇస్తామని ఏడీ శాంతి స్వరూప్ చెప్పడం గమనార్హం.

పంటలు కాపాడాలి..



రూ.లక్షలు పెట్టి పంటలు సాగు చేసుకున్నాం. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి పది రోజులైనా అధికారులు చుట్టూ తిరుగుతున్నాం. పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా మాకు కరెంటు ఇచ్చి పంటలను కాపాడాలి. - **బారికి నాగేంద్ర, రైతు, అగసనూరు**

రైతులంటేనే చిన్న చూపు



రైతులంటేనే అధికారులకు చిన్న చూపు. మేము ఎవరికి చెప్పుకోవాలి.. మాకు అధికారులు ఈవిధం చేస్తున్నారు. కళ్ల ముందే పంటలు ఎండిపోతున్నాయి.. - **కొడికి కురువ శివన్న, రైతు, అగసనూరు**

డ్రోన్ సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి
- 80 శాతం సబ్సిడీతో రైతులకు డ్రోన్లు పంపిణీ



రైతులకు డ్రోన్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కల్లూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో డ్రోన్ సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. ఆర్‌కేవీవై పథకం 2024-25లో భాగంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పాణ్యం నియోజకవర్గంలోని లక్ష్మీపురం, నన్నూరు గ్రామ రైతులకు గురువారం ఎమ్మెల్యే చేతుల మీదుగా 80 శాతం సబ్సిడీతో కిసాన్ డ్రోన్లను పంపిణీ చేశారు. మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎస్. శాలురెడ్డి, కల్లూరు, ఓర్వకల్లు వ్యవసాయ అధికారులు విష్ణువర్ధన్‌రెడ్డి, మధుమతి, నన్నూరు సింగిల్‌విండో అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి హాజరయ్యారు. గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ ఆధునీకీకరణకు ప్రభుత్వం కృషి చేస్తుందని, డ్రోన్ సాంకేతికతతో రైతులు ఎరువులు, పురుగుల మందుల పిచికారి సులభతరం అవుతుందని అన్నారు. డ్రోన్ మొత్తం ధర రూ.98వేలు కాగా 80 శాతం సబ్సిడీ రూ.78,0000, రైతువాటా రూ.19,6000తో కిసాన్ డ్రోన్‌లను రైతులకు అందజేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 800 గ్రామస్థాయి కిసాన్ సమైఖ్యలను ఏర్పాటు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ ఆకెపోగు వెంకటస్వామి, లక్ష్మీపురం మాజీ సర్పంచు పుల్లారెడ్డి, రామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, విజయుడు, శంషుద్దీన్, ఖాజామియా, కటిక హాసన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చట్టసభల్లో దివ్యాంగుల సమస్యలపై చర్చించండి

దివ్యాంగుల సమస్య లపై చట్టసభల్లో చర్చించాలని జిల్లా దివ్యాంగుల నూతన కమిటీ నాయ కులు ఎమ్మెల్యే గౌరు చరితను అభ్యర్థించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గౌరుచరితను దివ్యాంగుల జిల్లా సంఘం నాయకులు సన్మానించారు. దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం, స్వయం ఉపాధి, కృత్రిమ అవయవాలు, పరికరాలు తదితర సమస్యలను చట్టసభల్లో చర్చించి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి దివ్యాంగులను ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

వెంగళ్‌రెడ్డి సేవలు మరువలేనివి



వెంగళ్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న నాయకులు

కర్నూలు కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో అసోసియేషన్‌కు వెంగల్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివని ఏపీ ఎన్జీవో అసోసియేషన్, ఏపీ టీఎస్‌ఏ నాయకులు కొనియాడారు. గురువారం వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి పదవీ విరమణ సన్మాన సభ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ సర్వీసులో 38 సంవత్సరాలు, ఉమ్మడి జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ 20 సంవత్సరాలుగా పని చేయడం గొప్ప విషయమన్నారు. డీటీవో రామచంద్రరావు, నగర అధ్యక్షులు కాశన్న, రవికుమార్, గురుమూర్తి, మురళీధర్, రఘునందన్, రామకృష్ణ, శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రభాకర్ రెడ్డి, మద్దిలేటి, నాగేశ్వరరావు, కృష్ణమోహన్ పాల్గొన్నారు

ఒడిశా వాసి మృతి

ఆదోని రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైచిగేరి గ్రామం వద్ద ఆటో నుంచి కింద పడి ఒడిశాకు చెందిన రాజ్ ఠాకూర్(51) మృతి చెందాడు. వివరాల మేరకు.. నాగలాపురంలోని ఇటుకల వ్యాపారి వద్ద పనిచేస్తున్నాడు. పని నిమిత్తం ఆటోలో వెళ్తుండగా, అదుపుతప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

మూడు నెలల గర్భిణి మృతి

- ఆర్‌ఎంపీ అబార్షన్ చేయడం వల్ల తీవ్ర రక్తస్రావంతో చనిపోయింది
- పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి తల్లిదండ్రులు

పగిడ్యాల/నందికొట్కూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): పగిడ్యాల మండలంలోని బీరవోలు గ్రామంలో వాణి(25) అనే మున్నెళ్ల గర్భిణి మృతి చెందింది. ఆమె తల్లిదండ్రులు, బంధువులు తెలిపిన వివరాలివీ.. గడివేముల మండలం గని గ్రామానికి చెందిన వాణికి పగిడ్యాల మండలం బీరవోలు గ్రామానికి చెందిన లింగమ్మ, లింగన్న దంపతుల కుమారుడు లోకేష్‌తో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వాణి ప్రస్తుతం మున్నెళ్ల గర్భిణి. కర్నూలు ఓ ప్రైవేట్ సెంటర్‌లో స్కానింగ్ తీయించారు. మూడో సంతానం కూడా ఆడపిల్లేనని నిర్ధారించారు. దీంతో భర్త, అత్తింటివారు అబార్షన్ చేయించాలని నిర్ణయించుకున్నారు. గత నెల 28న నందికొట్కూరులో గీతారాణి అనే ఆర్‌ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్‌కు తీసుకెళ్లారు. గత నెల 29న అబార్షన్ చేయించారు. అదే రోజు రాత్రి ఇంటికి తీసుకెళ్లారు. తీవ్ర రక్తస్రావం కావడం, మాటలు సరిగా రాకపోవడంతో గత నెల 30వ తేదీన నందికొట్కూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకె ళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో వాణి పుట్టింటి కుటుంబ సభ్యులు, బంధువులు గురువారం నందికొట్కూర ులోని క్లినిక్ వద్దకు వచ్చారు. అయితే ఆమె క్లినిక్‌కు తాళం వేసుకొని పరారైందని వారు చెప్పారు.

గర్భిణి మృతి విషయంపై నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యంకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన గ్రామానికి వెళ్లి విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వాణి తల్లి శివమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.



శ్రీవాణి (ఫైల్)



తల్లిని కోల్పోయిన చిన్నారులు

ఉపాధి అవినీతికి చెక్!

- రెండు విడతలుగా ఫొటోలు అప్‌లోడ్ చేయాలి
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఆలూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): 'ఉపాధి'లో అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకు జాతీయ ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం సమూల మార్పులు తెస్తోంది. ఆగస్టు 1 నుంచి నిబంధనలను కఠినతరం చేస్తూ నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం(ఎన్ఎంఎంఎస్) యాప్‌ను తెచ్చింది. పనికి రాకున్నా కలీలకు హాజరు వేసే దొంగ మస్టర్ల కట్టడికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో 3,41,269 జాబ్‌కార్డులు ఉండగా 6,52,729 మంది కూలీలు పనిచేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఇప్పటిదాకా ఉన్న నిబంధనలను మరింత కఠినతరం చేయడంతో పాటు, అధికారుల పర్యవేక్షణ బాధ్యతలను పెంచింది.

రెండు పర్యాయాలు ఫొటోలు..

ఉపాధి మస్టర్లలో పేర్లు నమోదు చేసిన కూలీలు ఉదయం పనికిరాగానే ఒకసారి, అలాగే సాయంత్రం నాలుగు గంటల తర్వాత మరోసారి ఫొటోలు తీసి వాటిని నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అలాగే శ్రామికులకు వేతన చెల్లింపులకు ఫొటోలు తప్పనిసరి చేసింది. ఫొటోలు ఏ రోజుకు ఆ రోజే అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఒక రోజు పని ఫొటోలను తర్వాత రోజు అప్‌లోడ్ చేయడానికి వీలు పడదు.

పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ

పని ప్రదేశంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తీసే ఫొటోలను పంచాయతీ కార్యదర్శులు అప్‌లోడ్ చేయాలి. వీటిని పర్యవేక్షిస్తూ ఎంపీడీవోలకు నివేదిక అందజేయాలి. ఎన్ని ఫొటోలు సక్రమంగా తీశారనేది మండలస్థాయి అధికారులు తనిఖీ చేయాలి. గ్రామాల ఫొటోల నుంచి 20 శాతం వివరాలను జిల్లా అధికారులకు అప్‌లోడ్ చేయాలి.

అలసత్వం వహిస్తే చర్యలు

క్షేత్రస్థాయిలో రెండోసారి ఫొటోలు తీయని ఫీల్డ్ అసిస్టెంట్, సీనియర్ మేట్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఈ ప్రక్రియలో అలసత్వం వహించే పంచాయతీ కార్యదర్శులు, మండల, జిల్లా అధికారులపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే మండలస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లకు యాప్‌పై అవగాహన కల్పిస్తున్నారు. కూలీలకు వేతనం రావాలంటే ఏ పూటకాపూట ఫొటోలు తీసుకోవాల్సిందే. లేదంటే ఆ రోజు వేతనం రాదు.

అవినీతి లేకుండా చేసేందుకే..

ఉపాధి పథకంలో పూర్తిస్థాయిలో అవినీతి లేకుండా చేసేందుకు ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. ఆగస్టు 1 నుంచి కూలీలను రెండు పూటలా ఫొటోలు తీస్తాం. క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉదయం 9 గంటలకు, సాయంత్రం 4 గంటలకు ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీనిపై పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ ఉంటుంది. మండల, జిల్లా స్థాయి అధికారులకు కూడా ఫొటోలు పంపించాల్సి ఉంటుంది. దీనిపై అలసత్వం వహిస్తే ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లపై చర్యలు తప్పవు. - **వెంకటరమణయ్య, పీడీ కర్నూలు**

వేతనాలు పెంచాలని నిరాహార దీక్ష



నిరాహార దీక్ష చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కోడుమూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): వేతనాలు పెంచాలని కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు గురువారం సీఐటీయూ మండల కార్యదర్శి వీరన్న రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. స్థానిక పాతబస్టాండ్‌లో దీక్షలను సీపీఎం నాయకుడు గఫూర్‌మియా ప్రారంభించి మాట్లాడారు. పంచాయతీ అధికారులు, పాలకులు కలిసి కార్మికుల చేత వెట్టిచాకిరి చేయించుకుంటున్నారే తప్ప పనికి తగిన వేతనం ఇవ్వడం లేదని అన్నారు. కార్మికులు వేతనాలు వెంటనే చెల్లించాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షల్లో కార్మికులు సంజప్ప, నల్లారెడ్డి, చంద్రమోహన్, అచ్చమ్మ, లక్ష్మీదేవి, సరోజమ్మ, నాగలక్ష్మీ, భువనేశ్వరి, సువర్ణమ్మ, ప్రమీల పాల్గొన్నారు.

ఉద్యోగుల సహకారం మరువలేనిది



ఎస్ఈ రామచంద్రారెడ్డి దంపతులను సన్మానిస్తున్న అతిథులు

కర్నూలు న్యూసిటీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఇంజనీర్లు, ఉద్యోగుల సహకారం మరువలేనిదని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీర్ వి.రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం ఆయన పదవీ విరమణ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ సమావేశభవనంలో సన్మాన కార్యక్రమం జరిగింది. కర్నూలు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్‌సీ ఈ.మద్దన్న అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమానికి పీఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మురళీ కృష్ణనాయుడు, విశ్రాంత చీఫ్ ఇంజనీర్లు బి.సుబ్బారెడ్డి, ఎం.క్రిష్టారెడ్డి, సీవీ.సుబ్బారెడ్డి. అమరనాథ్‌రెడ్డి, ఎన్.క్రిష్ణారెడ్డి, ఏపీపీఆర్ డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కే.రవీంద్ర, పీఆర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.రవీంద్రారెడ్డిలు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఈ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఈటు పీఏ శ్రీనివాసులు, ఈఈలు రఘు రాంరెడ్డి, డీఈఈలు మహేశ్వరరెడ్డి, కర్రెన్న, రమేష్‌కు మార్‌రెడ్డి, ధనిబాబు, ఎం.శేషయ్య, హెచ్‌డీ ఈరన్న, ఏఈలు సతీష్, విజయ భాస్కర్ పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం

కర్నూలు న్యూసిటీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): నగరపాలకలో పదవీ విరమణ పొందిన టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ సాధిక్ హుస్సేన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులు గౌడ్‌లను మేయర్ బీవై రామయ్య, కమిషనర్ పి.విశ్వనాథ్‌లు సన్మానించారు. గురువారం నగర పాలక కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ఇంచార్జి ఎస్ఈ శేషసాయి, ఆర్‌ఓ ఇజ్రాయేలు, సూపరింటెండెంట్లు రామక్రిష్ణ, స్వర్ణలత, కుమార్, కార్పొరేటర్లు విక్రమసింహారెడ్డి, సాంబ శివరావు, లక్ష్మీకాంతరెడ్డి, జుబేర్ పాల్గొన్నారు.

కళాకారులకు అండగా ప్రభుత్వం

కర్నూలు అర్బన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కళాకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు వి.హనుమంతరావు చౌదరి అన్నారు. గురువారం నగరంలోని మద్దూర్ నగర్ తెలుగు తోటలో రంగస్థల కళాకారుల ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగులో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. రంగస్థల కళాకారులు నంది అవార్డు గ్రహిత దస్తగిరి, డిఎస్వీ సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, రుక్మాంగదరెడ్డి, షేక్షావలి, సెక్రటరీ పద్మా చౌదరి పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

కర్నూలు, జూలై 31(ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కల్లూరు శివప్పనగర్‌కు చెందిన లక్ష్మి అనే మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. లక్ష్మీ భర్త పుల్లయ్య డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 27న హైదరాబాదుకు యాక్టింగ్ డ్రైవర్‌గా వెళ్లాడు. 28వ తేదీ ఇంటికి వచ్చి చూస్తే భార్య లక్ష్మి, కొడుకు, కూతురు కనిపించలేదు. బంధువుల ఇళ్లలో, తెలిసిన వారి వద్ద వారికోసం గాలించినా ఎక్కడా కనిపించలేదు. స్థానికులను విచారిస్తే గత ఆదివారం సాయంత్రం లక్ష్మి, తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటినుంచి వెళ్లిపోయినట్లుగా తెలిపారు. తన భార్య అదృశ్యంపై ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ పుల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విక్రమసింహ తెలిపారు.

ఒకేషనల్ ప్రిన్సిపాల్‌కు అవార్డు

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో విశేషంగా సేవ లందించినందుకుగానూ కర్నూలు బీక్యాంపు ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌కు మౌలానా అబుల్ కలాం అజాద్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంటు ఇంటర్నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆల్ హఫీజ్ అకాడమి ఫర్ కల్చర్, పీస్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ - అరబ్ రిపబ్లిక్ ఆఫ్ ఈజిప్ట సంస్థ ఆధ్వర్యంలో విద్యారంగంలో విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపునకు కృషి చేసినందుకుగానూ స్వర్ణాంధ్ర-2047లో ఈ అవార్డును ప్రిన్సిపాల్‌కు అందజేశారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి
● దొడ్డిపాడులో 'తొలిఅడుగు'

కల్లూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత పేర్కొన్నారు. గురువారం కల్లూరు మండలం దొడ్డిపాడు గ్రామం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే నాబర్డ్ నిధులు రూ.1.41 కోట్లతో కర్నూలు- అనుగొండ నుంచి దొడ్డిపాడు వరకు తారురోడ్డు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో పూర్తి అయిన రెండు అంతర్గత రహదారులను ఎమ్మెల్యే ప్రారంభించారు. గౌరుచరిత మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డి.రామాంజనేయులు, వాకిటి మాదేష్, కురవ ధనుంజయ, దొడ్డిపాడు బాషా, ఖాసీం, ఇమ్రాన్, మునిస్వామి, పుల్లారెడ్డి, రామిరెడ్డి, చిన్నమారెన్న పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమం: కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

కోడుమూరు రూరల్: కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమం అందు తోందని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. మండలంలోని ఎర్రదొడ్డి, చిల్లబండ గ్రామాల్లో గురువారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజలకు కరపత్రాలు అందజేసి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్, ప్రధాన కార్యదర్శులు రామక్రిష్ణారెడ్డి, రాజు యువ నాయకుడు అరుణ్, చిల్లబండ బాషా, రాంచరణ్‌కుమార్, అయ్యన్న, మధు, నాగరాజు పాల్గొన్నారు.



టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేఈ జగదీష్ ఆధ్వర్యంలో...



దొడ్డిపాడులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత



ఎర్రదొడ్డిలో కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు అర్బన్: నగరంలోని 13వ వార్డులో టీడీపీ లీగల్ సెల్ నాయకులు సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. గురువారం సాయంత్రం పాత అయ్యప్పస్వామి దేవాలయం ప్రాంతంలో లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు కేఈ జగదీష్ ఆధ్వర్యంలో న్యాయవాదులు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వం అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో లీగల్ సెల్ వైస్ ప్రసిడెంట్ గణేష్ సింగ్, ధనరెడ్డి, తిరుపాల్ నాయక్, బీజేపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మోహన్, 13వ వార్డు ఇన్‌చార్జి, బూత్ కన్వీనరు పాల్గొన్నారు.

కర్నూలును క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మారుద్దాం

నగర పాలక కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): నగరంలో వ్యర్థాల నిర్వహణ(సీ అండ్‌డి వేస్టేజ్)కు తీసుకువచ్చిన నూతన విధానాన్ని పకడ్బందీగా అమలు చేసి కర్నూలును క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మారుద్దామని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. గురువారం ఎస్‌బీఐ కాలనీలోని నగర పాలక సమావేశభవనంలో పట్టణ ప్రణాళిక, పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల అధికారుల, ప్లానింగ్, శానిటేషన్ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి నిర్మాణ వ్యర్థాల నిర్వహణకు సరికొత్త విధానం తీసుకువస్తున్నామని, దీనిని అధికా రులు, సిబ్బంది సమన్వయంతో అమలు చేయాలని ఆదేశించారు. వ్యర్థాల సేకరణకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి ట్రాక్టర్‌కి రూ.500, టిప్పర్‌కి రూ.1000 చొప్పున యజమానులు రవాణా చార్జీలను చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ముగ్గురు కార్యదర్శులు బృందంగా ఏర్పడి, క్షేత్రస్థాయిలో సీ అడ్ డి వేస్టేజ్ నిర్వహణను పర్యవేక్షించాలని ఆదేశించారు. త్వరలో వార్డులకు నోడల్ అధికారులను నియమిస్తామన్నారు. అదేవిధంగా డ్రైనేజీల్లో తాగునీటి పైప్‌లైన్లు తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సిటి ప్లానర్ ప్రదీప్‌కుమార్, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్‌రెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథ్, హాజరైన అధికారులు

కేఎంసీ గ్రౌండ్‌ను కాపాడుకుందాం

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాయి ఉదయ్



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

కర్నూలు హాస్పిటల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ గ్రౌండ్‌ను కాపాడుకుంటామని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు సాయి ఉదయ్ అన్నారు. గురువారం మధ్యాహ్నం కర్నూలు మెడికల్ కాలేజీ ఎదుట ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సాయి ఉదయ్ మాట్లాడుతూ కర్నూలు మెడికల్ కాలేజీకి ఎంతో ఘన చరిత్ర ఉందని, మానసిక ఒత్తిడితో ఉన్న వైద్యులు, వైద్య విద్యార్థులకు మైదానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఒకప్పుడు మెడికల్ కాలేజీ మైదానం 8 ఎకరాలు ఉండేదని, ప్రస్తుతం 5 ఎకరాలకు చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ లేని సమయంలో పూర్వ విద్యార్థులు మైదానంలో ఇంజనీర్లతో ఎలా కొలతలు వేస్తారని, తక్షణమే ప్రిన్సిపాల్ వైద్యుల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి జూనియర్ డాక్టర్ల అభిప్రాయాన్ని తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అంజి, సహాయ కార్యదర్శి అబుబకార్, నగర కార్యదర్శి పృథ్వి యోగి, మహేష్ పాల్గొన్నారు.

పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై అవగాహన

ఓర్వకల్లు, జూలై 31(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరంలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం మండలంలోని నన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్ష, బ్లూప్రింట్లు, మోడల్ పేపర్లు, నేషనల్ అసెస్‌మెంటు సెంటర్ ఫరక్ సూచనల మేరకు సవరణల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మద్దిలేటి, ఉపాధ్యాయులు మధుసూదన్, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో విద్యార్థి అదృశ్యం

కర్నూలు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో లక్ష్మీపురం గ్రామంలో మోక్షిత్ అనే విద్యార్థి అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. మోక్షిత్ తల్లిదండ్రులు విజయలక్ష్మి, సురేష్‌లు లక్ష్మీపురం సమీపంలో ఉన్న స్కందలో నివాసం ఉంటున్నారు. మోక్షిత్ స్థానికంగా ఉన్న రామకృష్ణా విద్యామందిర్‌లో నాలుగో తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగానే మధ్యాహ్నం స్కూలు నుంచి ఇంటికి వచ్చి భోజనం చేసి తిరిగి స్కూలుకు వెళ్లాడు. సాయంత్రం ఎంతసేపటికీ ఇంటికి రాకపోయేసరికి తండ్రి స్కూల్‌కు వెళ్లగా అక్కడ కొడుకు కనిపించలేదు. దీంతో సురేష్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండలానికి 88 పింఛన్లు మంజూరు

సి.బెళగల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలానికి 88 పింఛన్లు కొత్తగా మంజూరైనట్లు ఎంపీడీవో రాణెమ్మ గురువారం తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని బ్రాహ్మణదొడ్డి, బురాన్‌దొడ్డి, కంబందహాల్, పోలకల్లు, సిబెళగల్, కొత్తకోట, ఇనగండ్ల, సంగాల గ్రామాల్లో వింతతువులకు 88 పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు.

కూచిపూడి నృత్య విద్యార్థులకు టీజీ అభినందన



కూచిపూడి విద్యార్థులను అభినందిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, జూలై 31(అంధ్రజ్యోతి): నేషనల్ యూత్ ప్రాజెక్టు వారు నిర్వహిస్తున్న 'భారత్‌కి సంతాన్' కార్యక్రమానికి జిల్లా నుంచి ఎంపికైన టీజీవీ ఫైన్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన కూచిపూడి నృత్య విద్యార్థినులను రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అభినందించారు. గురువారం టీజీ వెంకటేశ్ నివాసంలో నృత్య గురువు కేవీ భార్గవ్‌తో కలిసిన కూచిపూడి విద్యార్థులు కలిసి ఆయన ఆశీర్వాదాలు తీసుకున్నారు. టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ భారత్‌కి సంతాన్ కార్యక్రమానికి దక్షిణ భారతదేశం నుంచి మొత్తం 14 మందిని ఎంపిక చేయగా, అందులో కర్నూలు నగరానికి చెందిన లిఖిత, సత్యశ్రీ, మధుహాసిక అనే ముగ్గురు అమ్మాయిలు రాష్ట్ర తరపున ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని చెప్పారు.

కళారంగ కీర్తి ప్రతిష్టలను చాటిచెప్పాలి: కర్నూలు కళారంగ కీర్తి ప్రతిష్టలను కళాకారులు చాటిచెప్పాలని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ అన్నారు. ఇటీవల తిరుపతిలో జరిగిన అభినయ ఆర్ట్స్ జాతీయ స్థాయిలో నిర్వహించిన పౌరాణిక పద్య నాటక పోటీల్లో కళాకారులు ప్రదర్శించిన 'శ్రీ వేంకటేశ్వ మహాత్యం' నాటకానికి రెండు ఉత్తమ జాతీయ బహుమతులు లభించాయి. బుధవారం రాత్రి టీజీ వెంకటేశ్‌ను నగరంలో మౌర్య ఇన్‌లోని ఆయన కార్యాలయంలో కళాకారులు కలిశారు. ఉత్తమ సహాయ నటుడు జె.మోహన్ నాయక్‌కు (అనంతరాచార్య పాత్ర), మాస్టర్ సురభి యశోధర్ (బాల వెంకటేశ్వరుడు)తో పాటు నాటక దర్శకుడు వీవీ రమణారెడ్డిని టీజీ వెంకటేష్ అభినందించారు.

తైక్వాండో విజేతలకు అభినందన: ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు విజయవాడ చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జాతీయ స్థాయి (ఎపెన్ టూ ఆల్) తైక్వాండో పోటీల్లో కర్నూలు టీజీవీ, టీజీబీ తైక్వాండో అకాడమీ మార్షల్స్ ప్రతిభ కనబరిచారు.. విశ్వాసరావు 63 కేజీ విభాగంలో సిల్వర్ పతకం, గువ్వలసూర్య భార్గవ్ 44 కేజీ విభాగంలో సిల్వర్ పతకం, షికారీ మల్లికార్జున (63 కేజీ విభాగం)లో బ్రౌంజ్ పతకం సాధించారు. గురువారం మౌర్యఇన్ చాంబరులో మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ తైక్వాండో విజేతలను అభినందించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ



బాధితుడితో మాట్లాడుతున్న కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

కర్నూలు హాస్పిటల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం పసుపుల గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ హైస్కూల్ హెడ్‌మాస్టర్ ఇందిరా దంపతులను కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి పరామర్శించారు. గురువారం ఉదయం కర్నూలు నుంచి పసుపుల హైస్కూల్‌కు భర్త భాస్కర్‌తో కలిసి హెడ్‌మాస్టర్ ఇందిర ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. రోడ్డు ప్రమాదం జరిగింది. వారికి మెరుగైన వైద్యం అందించాలని క్యాజువాల్టీ ఎమర్జెన్సీ వైద్యులు సుబ్రహ్మణ్యంను కోరారు.

త్రీటౌన్ సీఐ శేషయ్యకు గౌరవ డాక్టరేట్

కర్నూలు, జూలై 31(ఆంధ్రజ్యోతి): కర్నూలు త్రీటౌన్ సీఐ శేషయ్యకు గౌరవ డాక్టరేట్ లభించింది. ఆయన చేసిన సామాజిక సేవలను గుర్తించి హెచ్‌డీపీసీ సంస్థ సీఈవో కవిత ఢిల్లీలో డాక్టరేట్ ప్రదానం చేశారు. సీఐని డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీలు అభినందించారు.

అనుమతి లేకుండా భవనాలు ఎలా నిర్మిస్తారు ?

అధికారులను ప్రశ్నించిన కౌన్సిలర్లు

గూడూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ అధికారుల అనుమతి లేకుండా భవన నిర్మాణ యజమానులు భవనాలను ఎలా నిర్మిస్తారని కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. బుధవారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ జె.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశాన్ని ఇన్‌చార్జి కమిషనర్, మేనేజర్ విజయలక్ష్మి నిర్వహించారు. కౌన్సిలర్లు దస్తగిరి, సలాంబాషా మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో అనుమతి లేకుండా భవన నిర్మాణాలు, కాంప్లెక్స్‌లు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే ఆ భవన నిర్మాణ యజమానులకు నోటీసులు ఇవ్వడంతోపాటు పనులు నిలిపివేయించాలని డిమాండ్ చేశారు. దీనిపై నగరపంచాయతీ అధికారులు యజమానులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామన్నారు. అలాగే పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, తక్షణమే పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని కోరారు. ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు కోరారు. సమావేశంలో నగర పంచాయతీ రెండో వైస్ చైర్మన్ లక్ష్మన్న, కౌన్సిలర్లు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

కర్నూలు న్యూసిటీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల నిలువు దోపిడీ ఆపాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ 5న చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. గురువారం కార్మిక కర్షక భవన్‌లో ఐక్యవేదిక అధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం సీఐటీయూ న్యూసిటీ అధ్యక్షుడు ఆర్.నరసిం హులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్, రైతు సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోయలేని విద్యుత్ భారాలను వేస్తున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం తొమ్మిది సార్లు కరెంటు చార్జీలు పెంచి రూ.32 వేల కోట్లు భారాలు ప్రజలపై వేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే రూ.15,485 కోట్లు సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపిందన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరెంటు సబ్‌స్టేషన్ల వద్ద జరిగే ధర్నాలో కార్మిక వర్గం ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం న్యూసిటీ కార్యదర్శి టి.రాముడు, ఎం.రాజశేఖర్, సీహెచ్.సాయిబాబా, విజయ్ పాల్గొన్నారు.

5 నుంచి టీ తాగుతూ మాట్లాడుకుందాం

● ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బంగిశ్రీధర్

కర్నూలు న్యూసిటీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టిందని, ఈ నెల 5 నుంచి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జిల్లా అధ్యక్షుడు బంగి శ్రీధర్ తెలిపారు. గురువారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు నెలల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఉద్యోగులకు రావాల్సిన రూ.25 వేల కోట్ల బకాయిలు, ఇతర ప్రయోజనాలపై విస్తృతంగా చర్చిస్తామన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సురేష్‌రెడ్డి, నగర అధ్యక్షుడు మురళీధర్‌నాయుడు, ఆంజనేయులు నాయక్, మద్దిలేటి పాల్గొన్నారు.

ఎస్‌పీజీ చర్చి కార్యదర్శిగా పెర్సీ ఇమ్మానియేల్

కర్నూలు కల్చరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌పీజీ క్రైస్ట్ చర్చికి కార్యదర్శిగా పెర్సీ ఇమ్మానియేల్, కోశాధికారిగా జక్కం భాగ్యరాజులను ఎన్నుకున్నారు. మూడురోజుల క్రితం జరిగిన చర్చి నూతన కమిటీ ఎన్నికల్లో ఎన్నికైన ప్యానల్ ప్రతినిధులు చర్చికి కార్యదర్శి, కోశాధికారి పదవులను గురువారం ఎన్నుకు న్నారు. ఎస్‌పీజీ క్రైస్ట్ చర్చికి అధ్యక్షుడిగా రెవ. పీఏ వరప్రసాద్ కొనసాగుతారు. కాగా నూతన కమిటీలో కార్యదర్శిగా పెర్సీ ఇమ్మానియేల్, కోశాధికారిగా జక్కం భాగ్యరాజు, డయోసిస్ కౌన్సిల్ సభ్యులుగా ఆదాము, బాలయ్య, ఆరోగ్యస్వామి, జార్జ్, కటారి అజరయ్యలు ఎన్నికయ్యారు. మహిళా విభాగం లో కారు రమణమ్మ, తొగురు శాంతిబాబ్జి, యూత్ విభాగంలో పెద్దేటి రవితేజ, ప్రశాంతి, యూత్ డైరెక్టర్‌గా తరని సౌజన్యలు ఎన్నికయ్యారు. మిషన్ ఎవజలికల్ డైరెక్టర్‌గా షీలా శైలజ, సండే స్కూల్ సూపరింటెండెంట్‌గా కె. శారదా, కన్వీనర్‌గా రాణి లీలలను ఎన్నుకున్నట్లు డయోసిస్ ఉపాధ్యక్షుడు రెవ. పీఏ వరప్రసాద్ తెలిపారు.

ప్రభుత్వ ఖాజీగా ఇస్మాయిల్ మౌలానా



కలెక్టర్‌ను కలిసిన ఇస్మాయిల్ మౌలానా

కర్నూలు కలెక్టరేట్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కల్లూరు అర్బన్ ప్రభుత్వ ఖాజీగా ఇస్మాయిల్ మౌలానాను నియమిస్తూ గురువారం రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతను క్రమశిక్షణతో నిర్వర్తించి, ముస్లింలకు సేవ చేస్తానన్నారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు అబ్దుల్ బాసిత్, పి.మౌలాలి, హఫీజ్, అబ్దుల్లా, హఫీజ్, మహ్మద్ బషీర్, హఫీజ్, అబ్దుల్ ఆలీమ్, అబ్దుల్లాహ్ పాల్గొన్నారు.

మోనూ ప్రకారం భోజనాన్ని అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

కోడుమూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు మోనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈవో అనంత య్య సూచించారు. పట్టణంలోని జడ్పీ బాలురు, బాలికలపాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. అనంతరం విద్యార్థుల హాజరు పట్టిక, వచ్చిన విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజన రిజిస్టర్‌ను పరిశీలించారు.

నిడ్జూరులో బురదనీరే..దిక్కు !



బురదమయంగా తాగునీరు

కర్నూలు రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం నిడ్జూరు గ్రామంలో బురదనీరే ప్రజలకు తాగునీరుగా మారింది. సుంకేసుల డ్యాం నుంచి దిగువ ఉన్న తుంగభద్ర నదికి ఇటీవల ప్రభుత్వం వరద నీరు విడుదల చేసింది. నిడ్జూరులో మాత్రం ఆ నీటిని ఫిల్టర్ చేయకుండా నేరుగా మోటర్ల ద్వారా మంచినీటి ట్యాంకుకు పంపింగ్ చేసి పబ్లిక్ కొళాలయిలకు వదులుతున్నారు. ఒండు నీళ్లు రావడంతో తాగేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో వైపు నీళ్ల దుర్వాసన వెదజల్లడంతో పాటు బురద, మట్టితో కూడిన నీళ్లు వస్తున్నాయని నిడ్జూరు వాసి మద్దిలేటి తెలిపారు. ఈవిషయాన్ని గ్రామస్థాయి అధికారికి తెలిపిన పట్టించు కోవడంలేదని వాపోయారు. అధికారులు స్పందించి నిడ్జూరులో సురక్షిత నీటిని వదలాలని కోరారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

ఆలూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆగస్టు 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.వెంకట నారాయణ గురువారం తెలిపారు. సాంకేతిక విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండి, పాలిసెట్ పరీక్ష రాయకపోయినా స్పాట్ అడ్మిషన్లు పొందే అవకాశం ఉందన్నారు. సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో సీట్లు ఉన్నాయన్నారు. పదో తరగతి మార్కు లిస్ట్, టీసీ, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, 5 పాస్‌పోర్ట్ ఫొటోలు, ఆధార్‌తో పాటు ఒరిజినల్స్‌తో పాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకురా వాలన్నారు. అడ్మిషన్ పొందిన రూ.5,800లు ఫీజు చెల్లించాలన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన వారికి స్కాలర్‌షిప్ వర్తించదన్నారు.

రీ సర్వే పారదర్శకంగా చేయాలి

● సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

ఆదోని, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే పారదర్శకంగా చేసి, సమస్యలను పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం కార్యాలయంలో ఆదోని డివిజన్ పరిధిలో రీ సర్వే ప్రాజెక్టు పరిధిలో 62 ఎఫ్‌పీఓల్‌ఆర్ (ఫీల్డ్ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్) అధికారులకు శిక్షణ ఇచ్చారు. రీ సర్వే ద్వారా గ్రామాల్లో భూ సరిహద్దులను సరిచేయాలని, ప్రజల సహకారం పొందాలని సూచిం చారు. ఈ ప్రాజెక్టు పూర్తయ్యాక భూ వివాదాలు పరిష్కారమవుతాయని, శాశ్వతమైన భూ పత్రాలు అందుతాయని వివరించారు.

మహిళా సంక్షేమమే ధ్యేయం


మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం పట్టణంలోని 18వ వార్డులో పర్యటించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అందాయా అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. తమ కాలనీలో సీసీ రోడ్లు వేయాలని మహిళలు కోరడంతో, పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. నాయకులు సాంబశివారెడ్డి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, బత్తినిలోక్‌నాథ్, సోమలింగడు, చల్లారవి, బీటీగోవిందు, క్రాంతిరవి, పర్లప్రకాష్ ఉన్నారు.

మహా సభలను జయప్రదం చేయండి


పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

పత్తికొండటౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఆగస్టు 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న 24వ జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. గురువారం సీఆర్ భవన్‌లో పోస్టర్లను విడుదల చేశారు. మూడు రోజులపాటు నిర్వహించే మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చిస్తామన్నారు. ఇతర అంశాలపై చర్చించి భవిష్యత్ ప్రణాళికలు రూపొందిస్తామని, ఈనెల 9వ తేదీనభారీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందన్నారు. భీమ లింగప్ప, రాజా సాహెబ్, కారుమంచి, సుల్తాన్, రామాంజనేయులు ఉన్నారు.

అంతర పంటల సాగుతో ఆదాయం

● రైతుతో మమేకం కార్యక్రమంలో జేడీఏ వరలక్ష్మి


డణాపురం గ్రామంలో రైతుతో మాట్లాడుతున్న జేడీఏ

ఆదోని రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రైతులు అంతర పంటలు సాగుచేసి ఆదాయం పొందాలని, రసాయనిక ఎరువులను వాడొద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పి.ఎల్.వరక్ష్మి సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రైతుతో మమేకం'లో భాగంగా గురువారం ఏడీఏ బాలవర్ధిరాజు, ఏవో సుధాకర్‌తో కలిసి మండలంలోని డణాపురం గ్రామంలో రైతు ధనుంజయ ఇంటికెళ్లారు. కుటుంబ నేపథ్యం, పంటల వివరాలు తెలుసుకున్నారు. రైతు తనకు రెండెకరాల పొలం ఉందని గత ఏడాది పత్తి వేశానని, ఎకరాకు 11క్వింటాళ్ల ప్రకారం రెండెకరాలకు 22 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందన్నారు. మార్కెట్‌లో విక్రయించగా రూ.1.10లక్షలు వచ్చాయని ఖర్చులు రూ.50వేలు పోగా, లాభం రూ.60వేలు వచ్చిందని తెలిపారు. ఈ ఏడాది మిరప సాగుచేశనన్నారు. జేడీఏ మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులను వాడాలని, ఇంటి పరిసరాల్లో పండ్లు, పూలు, కూరగాయలు పండిస్తే ఆహార భద్రత ఉంటుందన్నారు.


టిడ్కో గృహాలను అప్పగించండి

ఆదోని టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తమకు టిడ్కో గృహాలను వెంటనే అప్పగించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ లోకేశ్వరిని కలిసి తమ ఆవేదన వెలిబుచ్చారు. రూ.లక్ష చెల్లించి పదేళ్ల కావస్తున్నా, ఇంతవరకు గృహాలను కేటాయించలేదన్నారు. బ్యాంకు రుణం తీసుకోవడంతో కంతులు చెల్లించాలని బ్యాంకర్లు ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా గృహాలు కేటాయించాలని అలాకాని పక్షంలో తాము చెల్లించిన డబ్బును వడ్డీతో తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు గణేష్, వెంకోబ రావు, కుమలనాభ, కేశవ్ పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న లబ్ధిదారులు

పథకాలను వేగంగా అమలు చేయండి

ఆలూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను వేగంగా అమలు చేయాలని పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని హౌసింగ్ డీఈ విజయ్‌కుమార్‌ను ఆదేశించారు.


డీఈతో మాట్లాడుతున్న ఆర్డీవో

ప్రమాద మలుపు



ఓబులాపురం వద్ద ప్రమాదకర మలుపు

దేవనకొండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులాపురం హంద్రీనీవా కాలువ వద్ద మలుపు ప్రమాదకరంగా ఉంది. అటుగా వస్తున్న వాహనదారులు కనిపించకపోవడంతో ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా ప్రమాదం బారిన పడే అవకాశముంది. పక్కనే 20 అడుగుల కాలువ వుంది. వాహనదారులు అజాగ్రత్తగా ఉంటే అందులో పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి, మలుపు వద్ద సూచిక బోర్డులు, రెయిలింగ్ ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.


వేరుశనగను పరిశీలిస్తున్న సభ్యులు

ఇ-నామ్ బృందం పరిశీలన

ఆదోని అగ్రికల్చర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డును ఢిల్లీకి చెందిన ఇ-నామ్ బృందం గురువారం పరిశీలించింది. క్రయ విక్రయాలపై రైతులు, హమాలీలు, వ్యాపారులతో సమావేశం అయ్యారు. టెండర్‌కు ఉంచిన వేరుశనగ దిగుబడులను ఢిల్లీ ఎస్‌ఎఫ్‌ఏసీ కన్సల్టెన్సీ బిజినెస్ అధికారి అనిల్ కుమార్, రవీంద్ర చౌహాన్, దీపక్ వర్మ, దిలీప్ కుమార్ పరిశీలించి గిట్టుబాటు ధర తూకాల పై రైతులతో ఆరా తీశారు. ఇనాంను మరింత సులభతరం చేసేందుకు అప్‌డేట్ చేస్తున్నామన్నారు. ఏడీఎం నారాయణమూర్తి, మార్కెట్ యార్డు కార్యదర్శి కల్పన, సహాయ కార్యదర్శి శాంతకుమార్, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

రోగులతో చెలగాటం

● కాలం చెల్లిన మందులు ఇస్తున్న హొళగుంద వైద్యులు

హొళగుంద, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాలం చెల్లిన మందులను ఇస్తున్నట్లు రోగులు ఆరోపిస్తున్నారు. ఎక్స్‌పైర్ అయిన (అడ్రలిన్ ఇంజక్షన్), గుండె సంబంధిత రోగులతోపాటు హైబీపీ ఉన్నవారికి ఇచ్చే మందు. 2. (హైడ్రో కాటిజం ఇంజెక్షన్), అలర్జీ రోగులకు ఇచ్చే మందు. (పేరక్లలిన్ ఇంజక్షన్) మూత్ర సంబంధిత రోగులకు ఇచ్చే మందులు నెలరో క్రితమే ఎక్స్‌పైర్ అయ్యాయి. అయినా సిబ్బంది వాటినే అంటగడుతున్నారు.,

● ఈ విషయవై డ్యూటీ డాక్టర్ న్యూటన్‌ను వివరణ కోరగా కాలం చెల్లిన మందులను సిబ్బంది పొరపాటున ఉంచారని, వాటిని వెంటనే తొలగిస్తామని తెలిపారు.


జూన్ 2025లో ఎక్స్‌పైరీ అయిన ఇంజెక్షన్లు

ప్రతి ఎకరాకు హంద్రీ-నీవా నీరు

తుగ్గలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా తూము ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం రాంపురం, రాంపురం కొట్టాల గ్రామాలకు తూము ద్వారా నీరు మళ్లించే కార్యక్రమానికి వచ్చిన పత్తికొండ, గుంటూరు ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డిని టీడీపీ నాయకులు పత్తికొండ అశోక్, గంపల నారాయణ స్వామి సన్మానించారు.


ఎమ్మెల్యేలను సన్మానించిన నాయకులు

బసాపురం రోడ్డుకు రూ.1.50 కోట్లు


నిధులు మంజూరైన రహదారి ఇదే

ఆదోని, జూలై 31(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 104 బసాపురం రోడ్డు నిర్మాణానికి రూ.1.50 కోట్ల నాబార్డు నిధులు మంజూరయ్యాయి. గత వైసీపీ పాలనలో పట్టించుకోకపోవడంతో రహదారి తీవ్రంగా దెబ్బతింది. మొత్తం 4.5 కి.మీ.ల రహదారి పనులు చేపట్టనున్నారు. రోడ్డు నిర్మాణానికి అధికారులు రూ.2కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపగా, రూ.1.50 కోట్లు మాత్రమే మంజూరయ్యాయి. జూన్‌లో టెండర్ నిర్వహించగా ఆదోనికి చెందిన బలరాముడు దక్కించుకున్నాడు. రహదారితోపాటు గ్రామ సమీపంలో వంతెన కూడా నిర్మించాలని గ్రామస్థులు ప్రజాప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే వంతెన నిర్మాణాన్ని దృష్టిలో ఉంచుకొని, రూ.1.90 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు పేర్కొన్నారు. కాంట్రాక్టర్ బలరాముడు మాట్లాడుతూ ఇసుక అధిక ధరకు విక్రయిస్తుండటంతో రోడ్డు నిర్మాణం పనులు ఆలస్యమైందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తానన్నారు.

అదనపు తరగతి గదులు నిర్మించాలి

ఆదోని అగ్రికల్చర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్లుబావి పురపాలక ఉన్నత పాఠశాలకు అదనపు తరగతి గదులు నిర్మించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. గురువారం పాఠశాలను సందర్శించి, ఇరుకు గదులు, ఉపాధ్యాయ కొరతపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలా అప్‌గ్రేడ్ చేసి, గదులు నిర్మించలేదన్నారు. ఒక్కో గదిలో వంద మందికి పైగా విద్యార్థులు కూర్చుంటున్నారన్నారు. అలాగే ఐదుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని, భర్తీ చేయాలని కోరారు. కృష్ణమూర్తి, మల్లయ్య పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా సబ్సిడీ రాలేదు

దేవనకొండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల శాఖ ద్వారా రావలసిన సబ్సిడీ మంజూరు చేయాలని మండలంలోని తెర్నేకల్లు గ్రామానికి చెందిన గిరిపోగు చిన్నలింగన్న, రాజు, తిక్కస్వామి, నాగమ్మ కోరారు. గురువారం మాట్లాడుతూ 2021లో 'జగనన్న బడుగు వికాసం' పథకం కింద ట్రాక్టర్లను కొనుగోలు చేశామన్నారు. నాలుగేళ్లుగా నెలనెలా కంతులు కూడా చెల్లించామన్నారు. ప్రభుత్వం సబ్సిడీ రూ.3.68 లక్షలు మంజూరు చేసిందని, ఇంతవరకు చెల్లించలేదన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి, సబ్సిడీ విడుదల చేయాలని లబ్ధిదారులు కోరారు.


మాట్లాడుతున్న లబ్ధిదారులు

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

ఆదోని అగ్రికల్చర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకాఉరం భోజనం పెట్టాలని ఆదోని ఏఎస్‌డబ్ల్యూవో కే బాబు సూచించారు. గురువారం ఉదయం పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్-1ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అల్పాహారాన్ని పరిశీలించి, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా స్వర్ణలత

మద్దికెర, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి ఎంపీడీవోగా స్వర్ణలత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కొండయ్య సెలవుపై వెళ్లడంతో ఏవో స్వర్ణలతకు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు.

నిబద్ధతతో పనిచేయాలి

ఆదోని రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని సీడీపీవో ఉమా మహేశ్వరి తెలిపారు. గురువారం పదవీ విరమణ పొందండో సీడీపీవోను సిబ్బంది ఐసీడీఎస్ కార్యాలయంలో సన్మానించారు. సీడీపీవోలు అనురాధ, నరసమ్మ, వరలక్ష్మీ దేవి, మద్దమ్మ, రాజశేఖర్, భార్గవి పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

ఆదోని, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఇస్వీ చెరువులో నవోదయం 2.0లో భాగంగా సారా స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్ తెలిపారు. వివరాల మేరకు.. 450 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బోయగేరికి చెందిన బోయ చిన్నరంగను అరెస్టు చేశామన్నారు. గతంలో ఇదే కేసులో పట్టుబడిన బోయగేరికి చెందిన బోయ ఈరన్న, వాల్మీకి రాములతో పాటు బెల్లం వ్యాపారులు ఎం.ఓబులేష్, గురురాజును తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. కర్ణాటక మద్యం విక్రయం, రవాణా చేస్తే నిందితులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి, జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు.

బస్సులతోనే గడిపాను

పత్తికొండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బస్సులతో 36 ఏళ్లు పనిచేశానని ఆర్టీసీ మెకానిక్ అయ్యన్నగౌడ్ అన్నాడు. పదవీ విరమణ పొందడంతో పత్తికొండ డిపోలో గురువారం సన్మానించారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పరిశుభ్రంగా ఉంచాలి

మద్దికెర, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోను చెత్తను సేకరించి పరిశుభ్రంగా ఉంచాలని డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి సూచించారు. గురువారం మండల కేంద్రంలో చెత్తను పారిశుధ్య కార్మికులచే శుభ్రం చేయించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలని కోరారు. కార్యదర్శి శివకుమార్ ఉన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు

తుగ్గలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలుగు యువత నాయకుడు మిద్దె వెంకటేశ్ యాదవ్ అన్నారు. గురువారం మండల జొన్నగిరిలో మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా ఎదగనీయకుండా అడ్డుకుందన్నారు. టీడీపీ వాటిని సరిచేసి, ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ, 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇస్తామన్నారు. పీ-4 కార్యక్రమంతో పేదలు అభివృద్ధి చెందుతారన్నారు.

చర్చ లేకుండానే ముగిసిన సమావేశం

● మధ్యలోనే వెళ్లిపోయిన కౌన్సిలర్లు


ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

ఆదోని టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై చర్చించాల్సిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం పేలవంగా సాగింది. గురువారం ఛైర్ పర్సన్ లేకశ్వరి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్ సందీప్ మాట్లాడుతూ కౌన్సిలర్లకు అజెండాను రెండు రోజుల ముందే ఇస్తే, మాట్లాడటానికి అవకాశం ఉంటుందన్నారు. బసాపురం చెరువుకు చేయాల్సిన మరమ్మతులపై డీపీఆర్ (డిటైల్డ్) తయారు చేయించడంలో తీవ్ర జాప్యం చేయడం సరికాదన్నారు. వైస్ ఛైర్మన్ ముల్లా గౌస్ మాట్లాడుతూ కుక్కల బెడదతో అనేక మంది కుక్కకాటుకు గురవుతున్నారన్నారు. హెల్త్ ఆఫీసర్ డా.సందీప్ మాట్లాడుతూ, కుక్కల సంఖ్య పెరగకుండా శస్త్రచికిత్స చేయిస్తున్నామని తెలిపారు. కౌన్సిలర్ బాలాజీ మాట్లాడుతూ బసాపురం చెరువుకు శాశ్వత మరమ్మతులు చేసేందుకు రూ.కోట్లలో ఖర్చు అవుతోందని, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను కలిసి నిధుల మంజూరు చేయించాలన్నారు. కాగా సమావేశం జరుగుతుండగానే, కొందరు కౌన్సిలర్లు లేచి వెళ్లిపోవడం విచిత్రం కమిషనర్ కృష్ణ, ఎంఈ సత్యనారాయణ, డీఈలు వెంకట చలపతి, గోపినాథ్, అసిస్టెంట్ ఏసీపీ బాలముద్దయ్య పాల్గొన్నారు.

ఆలూరు బ్రాంచ్ కెనాల్‌కు నీరందిస్తాం


నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

ఆలూరు(చిప్పగిరి), జూలై 31 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ద్వారా ఆలూరు బ్రాంచ్ కెనాల్‌కు నీరందిస్తామని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ తెలిపారు. గురువారం గుంతకల్లు సమీపంలో తూము నుంచి నీటినిఏ ఏటీసీ డీసీ అధ్యక్షుడు నగరడోణ కిష్టప్ప విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హంద్రీనీవా ద్వారా చిప్పగిరి, ఆలూరు, హాలహర్వి మండలాలకు సాగునీరు అందు తుందన్నారు. వీరభద్రగౌడ్ మాట్లాడుతూ ఆలూరు ప్రాంతానికి నీటిని విడుదల చేయడం పట్ల సీఎం చంద్రబాబు, మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే జయరాంకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు నారాయణ స్వామి, గుమ్మనూరు నారాయణ, ఎంపీటీసీ రజినీ, తిమ్మయ్య, అట్టికల్ బాబు, ఈఈ శ్రీనివాసనాయక్, డీఈ చంద్ర ఉన్నారు.

వసతులు కల్పించాలి


బస్టాండులో చెత్తను చూపుతున్న నాయకులు

దేవనకొండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండు వద్ద మౌలిక వసతులు కల్పించాలని ఏఐవైఎఫ్ నాయకులు రవి, రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం బస్టాండ్ ఆవరణను పరిశీలిం చారు. చెత్తాచెదారం, మురుగుదో దర్గంధం వస్తోందని మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తాగునీరు, కుర్చీలు కుడా లేవన్నారు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. బాస్కర్, బాషా ఉన్నారు.


మాట్లాడుతున్న వైకుంఠం శివప్రసాద్

చంద్రబాబుతోనే ప్రగతి

హాలహర్వి, జూలై31(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం ప్రసాద్, వైకుంఠం జ్యోతి అన్నారు. గురువారం హాలహర్విలో 'సుపరిపాలన తొలి అడుగు' నిర్వహించారు. శ్రీధర్, శేషగిరి, విరుపాపురం బసప్ప, నాగరాజు ఉన్నారు.


మాట్లాడుతున్న వీరభద్రగౌడ్

పరిష్కారమే మొదటి అడుగు

ఆస్పరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే సుపరిపాలనకు మొదటి అడుగని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ పేర్కొన్నారు. గురువారం ఆస్పరిలో ఇంటింటికి వెళ్లి సంక్షేమం, అభివృద్ధి పథకాలను వివరించారు. జగన్‌మోహన్‌బాబు, రవిరెడ్డి, రంగనాథ్, రహింతుల్లా ఉన్నారు.

షెడ్ల నిర్మాణానికి నిధులు

వెల్దుర్తి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలికల వసతిగృహంలో నాలుగు షెడ్ల నిర్మాణానికి ఎంపీ నిధులు రూ.5లక్షలు మంజూరైనట్లు వార్డెన్ గిరిజాదేవి తెలిపారు. గురువారం ఎమ్మెల్యే శ్యాంబాబును అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారులు శ్రీనివాసులు, ఆంజనేయులు, గిరిజాదేవి కలిశారు. స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తానని, బీసీ హాస్టల్-2 నిర్మాణానికి కలెక్టర్ దృష్టికి తీసుకెళతానన్నారు.


ఖాతాకు లింకు చేయిస్తున్న అధికారులు

ఈకేవైసీ తప్పనిసరి

పత్తికొండ టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలంటే ఈకేవైసీ, ఎన్‌పీసీఐ లింకు తప్పనిసరని ఏవో వెంకటరాముడు అన్నారు. గురువారం బ్యాంకు అధికారులతో సమావేశయ్యారు. రైతుల ఖాతాలకు ఆధార్‌లింకు, ఎన్‌పీసీఐ లింకును రైతులతో చేయించారు. జూటూరులో 33, చిన్నహుల్తిలో 9, దూదేకొండ 13, పత్తికొండలో 47, చక్రాళ్లలో 6, పుచ్చకాయలమడ, హోసూరు 13, పెద్దహుల్తి 8, పందికోన 59, దేవనబండలో 5 చొప్పున సుమారు 239 మంది రైతులు ఆగస్టు 2వ ఎన్‌పీసీఐ లింకు చేయించుకో వాలన్నారు. ఏఈవో శ్రీనాథ్, రియాజ్‌బాషా ఉన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● తుగ్గలి ఎస్ఐ బాలనరసింహులు



తుగ్గలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని తుగ్గలి ఎస్ఐ బాలనరసింహులు సూచించారు.

ప్రశ్న: ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారా?

జవాబు: రోజుకో గ్రామంలో అవగాహన కల్పిస్తున్నాం. మహిళలకు వారి చట్టాలను వివరిస్తున్నాం. క్షణికావేశాల్లో తప్పులు చేయవద్దని, నేర ప్రవృత్తిని మానుకోవాలని కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

ప్రశ్న: నేరాలు అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: నేరాలు, దొంగతనాలు చోటుచేసుకోకుండా ప్రతి గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. కొత్త వ్యక్తులు గ్రామంలోకి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నాం.

ప్రశ్న: ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా ఉంచారా?

జవాబు: స్టేషన్ పరిధిలో ఫ్యాక్షన్ హత్యలు లేవు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు పల్లె నిద్ర నిర్వహిస్తున్నాం. వేడుకలు, పండుగల సమయాల్లో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకున్నారా?

జవాబు: ప్రతిరోజు వాహనాలను తనిఖీ చేస్తున్నాం. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి, ఉల్లం ఘించిన వాహనదారులకు జరిమానా విధిస్తున్నాం.

ప్రశ్న: సైబర్ మోసాల నివారణకు చర్యలు తీసుకున్నారా?

జవాబు: సైబర్ మోసాలకు గురికావద్దని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఫోన్లకు అజ్ఞాత వ్యక్తులు పంపే మెసేజ్‌లు చూడవద్దని, ఓటీపీలు అడిగితే చెప్పవద్దని అవగాహన కల్పింస్తున్నాం. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలియచేస్తున్నాం.

ప్రశ్న: అసాంఘిక కార్యకలాపాల నివారణకు చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు: మట్కా, పేకాట నివారణకు గ్రామాల్లో నిఘా ఉంచాం.

ప్రశ్న: ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారా?

జవాబు: విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ నేరాలు, శిక్షలను వివరించి, ర్యాగింగ్‌కు పాల్పడ్డవారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తున్నాం.

వర్షాభావంతో ఎండుతున్న పైర్లు

● డివిజన్‌లో అత్యధికంగా 1.5 లక్షల ఎకరాల్లో పంటల సాగు ● యాజమాన్య పద్ధతులతోనే చీడపీడ నివారణ - ఏడీఏ ● ఆందోళనలో పత్తి రైతులు


వర్షంలేక ఎండుబారిన వేరుశనగ పంట


గిడసబారిన పత్తి పంట


నీరు అడుగంటడంతో ఎండిన కూరగాయల పంట

ఎమ్మిగనూరు/గోనెగండ్ల, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు డివిజన్‌లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు వర్షాభావ పరస్థితుల కారణంగా వాడిపోతున్నాయి. కొన్ని రోజులుగా వానలు పడకపోవడం, ముసురు కమ్ముకోవడంతో పంటలకు చేడపీడలు అధికమయ్యాయి. ఎమ్మిగనూర డివిజన్ పరిధిలో 1లక్షా 70వేల ఎకరాలు సాగు కావాల్సి ఉండగా ఈ ఏడాది దాదాపు 1లక్ష 50వేల ఎకరాల వరకు సాగు అయ్యాయి. అందులో ఎక్కువగా 1లక్ష 20వేల ఎకరాల వరకు పత్తి, సాగు కాగా మిగతా పంటలైన వేరుశనగ, జొన్న, కొర్ర, సజ్జ, మిరప, ఉల్లి, తదితర పంటలు సాగు చేశారు. అయితే జూలై నెల ముగుస్తున్నప్పటికి వానలు మాత్రం పడటంలేదు. దీంతో మెట్ట భూమలులలో సాగు చేసిన పంటలు కూడా ఎండిపోతున్నాయి.

నీటి బెట్టతో దెబ్బతింటున్న పంటలు: ఈ ఏడాది డివిజన్‌లో రైతులు ముందస్తువానలు పడటంతో ఎక్కువగా వర్షం రాకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయి. మొట్టభూములలో సాగు చేసిన దాదాపు 40వేల ఎకరాలలో పంటలు పత్తి, వేరుశెనగ, ఉల్లి, కొర్ర పంటలు దెబ్బతింటున్నాయి. డివిజన్‌లో రైతులు దాదాపు లక్ష 20వేల ఎకరాలలో పత్తి పంటను సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులే ప్రకటించారు. అయితే పత్తి పంటను సాగు చేసిన తర్వాత ఒక వర్షం కూడా పదును వర్షం కురియ లేదు. అయితే వర్షం కురియక, ఈదురు గాలులకు, ఎండ వేడిమికి పత్తి పంటకు 50 రోజుల పంటకు పేనుబంక, రసం పీల్చే పురుగు, తెల్లదోమ సోకింది. దీంతో పత్తి పంట ఎదుగు బోదుగు లేకుండా నాలుగు ఆకులు వేసి పెరగడం నిలిచిపోయింది. అలాగే ఆకులకు పేను బంక కారణంగా రంధ్రాలు పడిపోతున్నాయి. రైతులు ఎంతో ఆశతో సాగు చేసిన పత్తి పంట కు చీడపీడలు సోకడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మిగనూరు డివిజన్‌లో ఇప్పటికే బావులు, బోర్లతో పాటు మెట్టపొలాల్లో కూడా పత్తిపంటను రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. కొద్దో గొప్పో బావులు, బోర్ల దగ్గర సాగు చేసిన పత్తి పంట మాత్రమే కొంత వరకు బావుంది. మిగతా వర్షంపై ఆదారపడి సాగు చేసిన మెట్ట పొలంలోని పత్తిపంటకు చీడపీడలు ఎక్కవగా సోకాయి. గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు, మంత్రాలయం మండలాలో దాదాపు 20వేల ఎకరాలలో పత్తి పంటకుకు చీడపీడలు సోకినట్లు తెలస్తోంది. అలాగే దాదాపు 40వేల ఎకరాలలో సాగు చేసిన పంటకు వర్షం కురియని కారణంగా నీటి బెట్ట తో మొక్కలు దెబ్బతింటున్నట్లు తెలుస్తోంది. ఈ చిన్న పంటకు చీడపీడలు సోకడంతో పంట పేరగడం లేదు. దీనికి తోడు ఈదురుగాలులు, ఎండ వేడిమి తోడు కావడంతో పత్తి పంట నేలకొరిగింది. 50 రోజుల పైరుకే పేనుబంక, రసంపీల్చే, తెల్లదోమ చేటు చేసుకోవడంతో రైతు ఎంత మందు ఏస్థాయిలో పిచికారిచేయాలో అంతుచిక్కడం లేదని రైతులు వాపోతున్నారు.

గిడసబారుతున్న పత్తి పంట: 50 రోజుల పంటకు పేనుబంక, రసం పీల్చే పురుగు సోకడం పైరు పేరుగుదలకు కావల్సిన వర్షం కురియక పోవడం కారణంగా పత్తి పంట గిడస బారుతోంది. వేల రుపాయలు అప్పులుచేసి పత్తి పంటపై ఆశతో సాగు చేస్తే 50 రోజుల పైరుకే పేనుబంక, రసంపీల్చే, తెల్లదోమ పోటు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎండిన బావులు, బోర్లు: ఈ ఏడాది వంకలు, వాగులు పొంగిపార్లే వర్షాలు డివిజన్‌లో కురియక పోవడంతో బావులు, బోర్లు ఎండిపోతున్నాయి. దీంతో వాటి కింద సాగు చేసిన పంటలు సైతం ఎండుముఖం పట్టాయి. చేతికి అందుతుందన్న పైర్లు ఎండిపోతుంటే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు డివిజన్‌లో 20వేల బోర్ల వరకు నీరు అందక ఎండిపోయినట్లు తెలుస్తోంది. బావుల పరిస్థితి ఇక చెప్పనవసరం లేదు.

రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది: పత్తి పంటకు సోకిన చీడపీడల నివారణకు డివిజన్ స్థాయిలోని అధికారులు, మండల ఏవో రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతనై ఉంది. ఏ సమయంలో ఏ మందులు ఎంత మోతాదులో పిచికారి చేయాలి అనే విషయం కూడా తెలపాల్సి ఉంది. దీనికి తోడు వర్షం కురియక పోవడంతో పంటలు బెట్ట పడిపోయాయి. ఈ సమయంలో రైతులు పంటలు కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాల్సి ఉంది.

బోర్లు ఎండిపోతున్నాయి



వర్షాలు కురియక పోవడం వల్ల భూగర్భజలాలు అందక బావులు, బోర్లు ఎండిపోతున్నాయి. ఈ కారణంగా బావులు, బోర్ల కింద సాగు చేసిన పంటలకు నీరు అందక పంటలు ఎండిపోవడం మొదలు పెట్టాయి. అరకొరగా వచ్చిన నీరు పంటలకు సరిపోవడం లేదు. బోర్ల కింద సాగు చేసిన రెండు ఎకరాల పత్తి పంట ఎండిపోతుంది.

రాయుడు, రైతు, గోనెగండ్ల

వర్షంలేక పంట బెట్టపోయింది



గోనెగండ్లలో నాలుగు ఎకరాలలో పత్తి పంటను సాగు చేశాను. అయితే గత నెల రోజులుగా పత్తి పంటకు సరిపడ వర్షం కురియలేదు. ఈదురుగాలులు, ఎండ వేడిమికి సాగు చేసిన పంట బెట్ట బారుతుంది. దీనికి తోడు చీడపీడలు సోకుతున్నాయి. ముందుజాగ్రత్తలు తీసుకున్నప్పటికి నివారణ కలగడం లేదు.

ఇక్బాల్ బాషా, రైతు, గోనెగండ్ల.

సలహాలను పాటించాలి



ఈ ఏడాది ఇప్పటి వరకు దాదాపు 1లక్ష 20వేల ఎకరాలలో పత్తి పంటను సాగు చేశారు. ప్రస్తుతం ఉన్న పొడి వాతావరణం వల్ల ఆకులు వడలిపోయినట్లు గమనించాం. పత్తి పంటను సాగు చేసిన 20 రోజుల లోపు అయితే 19:19:19అనే స్పెషల్ ఫర్టిలైజర్ 2.5 గ్రాములు లేదా పత్తి పంటను సాగు చేసిన 30 రోజులు అయితే 5 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలుపకుని పిచికారి చేస్తే మొక్కలను బెట్ట పరస్థితుల నుంచి కాపాడుకోవచ్చునని తెలిపారు.

\- మహమ్మద్ ఖాద్రీ

శ్రీమఠంలో సేవలు చేయడం అద్భుతం


విజయేంద్రాచార్‌కు చెక్కును అందజేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ముప్పై ఏళ్లుగా రాఘవేంద్రస్వామి మఠంలో భక్తులకు మెరుగైన సేవలు అందించి గుర్తింపు తెచ్చుకోవడం అద్భుతమని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. గురువారం శ్రీమఠం సూపరింటెండెంట్, సీఆర్వోగా పని చేసిన గుంజళ్లి విజయేంద్రాచార్ పదవి విరమణ పొందారు. విజయేంద్రాచార్ సతీమణి నేత్రవతికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు చెక్కు, మెమెంటో, శేషవస్త్రం, పరిమళ ప్రసాదం ఇచ్చి సత్కరించారు.

సొసైటీ ద్వారా మెరుగైన సేవలందిస్తాం

మంత్రాలయం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు సొసైటీల ద్వారా రుణాలు ఇచ్చి మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని మంచాల సొసైటీ ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, కల్లుదేవకుంట సొసైటీ ఛైర్మన్ రాదమ అన్నారు. గురువారం కల్లుదేవకుంట, మంచాల సొసైటీలకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి ఆదేశాల మేరకు ఛైర్మన్లు, డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. మంచాల సొసైటీ సీఈవో ఖాజాహుశేన్, కల్లుదేవకుంట సొసైటీ సీఈవో వెంకటేశ్ ఆధ్వర్యంలో డైరెక్టర్లుగా ఎన్నికైన డీసీ తిమ్మప్ప, చాపల నగేష్, కల్లుదేవకుంట సొసైటీ డైరెక్టర్లుగా భీమయ్య, లక్ష్మన్న బాధ్యతలు చేపట్టారు

అనువైన చోట ఇంటి స్థలాలు ఇవ్వాలి

కౌతాళం, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ళులేని పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, పల్లెల్లో 3 సెంట్ల ఇంటి స్థలాలు ఇవ్వాలనుకుంటున్న తరుణంలో ప్రజలకు అనువైన ప్రదేశంలో ఇంటి స్థలాలు ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ కౌతాళం టౌన్ అధ్యక్షుడు కాశి విశ్వనాథ కోరారు. టీడీపీ ప్రభుత్వం పేదలకు ఇంటి పట్టాలను అందిచాలన్న ఉద్దేశ్యంతో గ్రామాల్లో ఇళ్ళు లేని లబ్ధిదారులను గుర్తించి వారికి 3సెంట్ల ప్రకారం స్థలాలను ఇచ్చేందుకు ప్రణాళికలను సిద్ధ చేస్తున్న నేపథ్యంలో గ్రామానికి దగ్గరలో అందరికి అనుకూలమైన చోటు స్థలాలు ఇవ్వాలని కోరారు. అనంతరం గ్రామ శివప్ప కాలనీ, మంగలివీధిలో ఇళ్ళు లేని వారితో కలిసి తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు రాజబాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి


మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప

ఎమ్మిగనూరు టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు అన్ని సౌకర్యాలు, వసతి గృహానికి మరొక బిల్డింగ్ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక కేవీపీఎస్ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రంగప్ప మాట్లాడుతూ బీసీ ప్రీ మెట్రిక్ ప్రభుత్వ హాస్టల్‌లో 400 మందికి పైగా విద్యార్థులు ఉండగా వారికి కేవలం 10 స్నానపు గదులు మాత్రమే ఉన్నాయన్నారు. కాలకృత్యాలకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నార న్నారు. రాత్రి సమయంలో నిద్ర పోవడానికి స్థలం సరిపోక విద్యార్థులు వారి ట్రంక్ పెట్టెలను ఒకదానిపై ఒకటి ఉంచి నిద్ర పోవాల్సిన దుస్థితి ఉందన్నారు. ప్రభుత్వ నిధులతోనే బీసీ సంక్షేమ వసతి గృహాలను అభివృద్ధి చేసి పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. నితీష్, అజయ్, హుస్సేన్ పాల్గొన్నారు

తల్లీకొడుకుల అదృశ్యం

మంత్రాలయం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని చిలకలడోన గ్రామానికి చెందిన రెండేళ్ల బాలుడితో కలిసి తల్లి అదృశ్యమైనట్లు మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపారు. వివరాల మేరకు జూలై 30న తల్లి, కొడుకు ఇంటి నుంచి కనిపించకుండా పోయారు. ఆమె భర్త, తల్లిదండ్రులు బంధువులు, ఇతరుల వద్ద గాలించారు. ఎక్కడా ఆచూకి లభ్యం కాకపోవడంతో తాయమ్మ తల్లి గోనెగండ్ల మండలం చిన్నమర్రివీడు చెందిన బోయ ఈరమ్మ గురువారం రాత్రి మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు తల్లి, కొడుకు అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా పెద్ద ఉరుసు

గోనెగండ్ల, జూలై 31(ఆంధ్రజ్యోతి): గంజహళ్లి గ్రామంలో వెలసిన మహాత్మ బడేసాహెబ్ స్వామి వారి పెద్ద ఉరుసు గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి దర్గా పీఠాధిపతులు స్వామి వారి గంధంతో మేళతాళలతో ఉరేగింపుగా దర్గాను చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్వామి వారి జీవసమాదికి భక్తితో గంధం పట్టించారు. సమాధిని పూలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమానికి భక్తుల పెద్ద సంఖ్యలో హజరయ్యారు. పీఠాధిపతుల ఇంటి నుంచి గంధాన్ని దర్గాకు తీసుకెళుతున్న మార్గంలో భక్తులు పీఠాధిపతులను ప్రత్యేకంగా పూలు, జలం, అత్తరుతో పూజించారు.

సేవలతోనే గుర్తింపు

పెద్దకడబూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఏ రంగంలోనైనా మంచి సేవలు అందించినప్పుడే గుర్తింపు లభిస్తుందని టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి నరవ రకామాంతరెడ్డి, జిల్లా యువనాయకులు దివకర్‌రెడ్డి, తెలుగు మహిళా నాయకురాలు నరవ శశిరేఖలు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన పెద్దకడుబూరులోని రైన్‌బో పాఠశాలలో ఎంఈవో-సువర్ణల సునియం పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీవిద్య, ఎంఈవోలు రాంమూర్తి, ఆంజనేయులు, మొహినుద్దీన్, శోభారాణి, వైసీపీ నాయకులు రాంమ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, విజయేంద్రరెడ్డి లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల సమస్యలపై ప్రభుత్వం సత్వరమే స్పందించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం కార్యదర్శి గోవిందు, పట్టణ నాయకులు లక్ష్మీ నరసయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరుస్తామని వాటిని నిర్లక్ష్యం చేయడం వల్ల అనేక పాఠశాలలలో పరిష్కారం కాకుండా విద్యార్థుల తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రమేష్, మాదన్న, రాముడు పాల్గొన్నారు.

వెండి అలంకరణలో స్వామి


వెండి అలంకరణలో స్వామివారి మూలవిరాట్

కౌతాళం, జూలై 31(ఆంధ్రజ్యోతి):జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాసపు ఉత్సవాలలో భాగంగా మొదటి గురువారం రోజున భక్తులు స్వామి దర్శనానికి అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు వెండి అలంకరణ చేపట్టి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసి అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఆలయ ఈఓ విజయరాజు తెలిపారు. స్వామి వారికి సేవ చేయాలనుకున్న భక్తులు ముందుగా ఆలయ సూపరిటెండెంట్ వెంకటేశ్వర్లుకు తమ చిరునామా నకలు జతపరిచి దేవాలయ గుర్తింపు కార్డులు పొందాలని తెలిపారు.

రూ.50వేలు విరాళం: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో భక్తులకు అందిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి గురువారం ఓ భక్తుడు రూ.50వేల నగదును విరాళంగా అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈఓ విజయరాజు తెలిపారు. దాతలకు ఆలయ అర్చకులు స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి లడ్డూ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శివ పుత్ర స్వామి ఉన్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా దయాసాగర్

ఎమ్మిగనూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి):ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్ వీజేపి దయాసాగర్‌ను బీజేపీ జిల్లా కార్యదర్శిగా ఆపార్టీ అధిష్టానం నియమించింది. దయాసాగర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలు, కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడి సంక్షేమ పాలనను ప్రజల్లోకి తీసుకేళ్లానన్నారు.

కార్పొరేట్ విద్యకు వ్యతిరేకంగా పోరాడాలి

గోనెగండ్ల, జూలై 31(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యకు వ్యతిరేకంగా ప్రతి విద్యార్థి పోరాటం చేయాలని ఏఐఎస్ఎఫ్ తాలుకా అధ్యక్షుడు మునిస్వామి అన్నారు. గురువారం మండల పరిధిలోని మోడల్ స్కూల్‌లో ఏఐఎస్ఎఫ్ నాయకుల సమావేశం నిర్వహించారు. అన్సూర్, బాషా, సమీర్, అశోక్, ప్రభాకర్ పాల్గొన్నారు.

స్వర్ణ పల్లకిలో రాఘవేంద్రుడు


స్వర్ణపల్లకిలో విహరిస్తున్న రాఘవేంద్రుడు

మంత్రాలయం, జూలై 31(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్రస్వామి స్వర్ణ పల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన గురువారం శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మఠం అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో అంగరంగ వైభవంగా ఊరేగించారు

శ్రీ మఠానికి రూ.లక్ష విరాళం : శ్రీమఠానికి బెంగళూరుకు చెంది న రాఘవేంద్ర అనే భక్తుడు రూ.లక్ష దైనందిక సమార్పణ సేవకు విరా ళంగా ఇచ్చినట్లు మఠం మేనేజరు ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. గురువారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.లక్ష నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాత కుటుంబానికి పీఠాధిపతి రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

ఉచితంగా ఆముదాల పంపిణీ

ఎమ్మిగనూరు రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు గురువారం ఉచితంగా ఆముదాలను అందజేశారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి ఆధ్వర్యంలో 50 మంది రైతులకు ఆముదాలను అందజేశారు. వివరాలకు కృషి విజ్ఞాన కేంద్రాన్ని సంప్రదించాలని ఆయన తెలిపారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

ఎమ్మిగనూరు టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని, దీనిపై ప్రజలు ప్రశ్నించాలని వైసీపీ పట్టణ అధ్యక్షుడు నాగేషప్ప అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని 17,18వ వార్డులో జరిగిన బాబు ష్యూరిటి - మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నట్లు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహులు, వైస్ ఛైర్మన్ నజీర్, బజారి, నాగేష్, విశ్వనాథ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం


భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ భార్గవి

మంత్రాలయం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఏర్పాట్లు చేపడుతున్నామని ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి తెలిపారు. గురువారం మంత్రాలయంలో పార్కింగ్ ఏర్పాట్లు ఈ నెల 8 నుంచి జరిగే రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలకు, భక్తులకు అవసరమైన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. తుంగభద్ర నదితీరం, మధ్వమార్గ్ కారిడార్, రాఘవేంద్ర సర్కిల్, ప్రధాన రహదారులు పరిశీలించారు. నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన భార్గవి మంత్రాలయం ప్రధాన వీధులను, భక్తుల రద్దీని పర్యవేక్షించారు. పరిశీలనలో మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, పరమేష్, రంగస్వామి, పాల్గొన్నారు.

సేవలు చిరకాలం గుర్తుంటాయి


బంట్రోతు గోపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోనెగండ్ల, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రజలకు చేసిన సేవలే చిరకాలం గుర్తుంటాయని మండల టీడీపీ కన్వీనర్ తిరుపతయ్య నాయుడు అన్నారు. గురువారం మండల కేంద్రమైన గోనెగండ్లలో పోస్టాఫీస్‌లో పనిచేస్తున్న బంట్రోతు గోపాల్ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు నాయకులు, అధికారులు ఆయన శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. గ్రామంలో చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పోస్టాఫీస్ సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాసేవతోనే సంతోషం

నందవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రజలకు, రైతులకు సేవ చేయడంలోనే అధికారులకు సంతోషం లభిస్తుందని మండల సహకార పరపతి సంఘం ఛైర్మన్ దర్మాపురం గోపాల్ అన్నారు. గురువారం నందవరం సహకార పరపతి సంఘం బ్యాంక్ సీఈవో సుదర్శనం పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు డైరెక్టర్ సుధీర్, నాగలదిన్నె శేశాద్రి తిమ్మప్ప, బ్యాంక్ డైరెక్టర్లు బీమశేఖర్, మహేష్, సత్యారెడ్డి, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

మంత్రాలయం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలోని బీపీఆర్ ఫామ్ హౌస్ వద్ద కోసిగి పట్టణం నుంచి 45, చింతకుంట నుంచి 5 కుటుంబాలు దాదాపు మొత్తం 50 కుటుంబాల నుంచి టీడీపీ కార్యకర్తలు బీజేపీలో చేరారు. 50 కుటుంబాలు, టీడీపీ సాధారణ కార్యకర్తలను బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కౌతాళం మండలం బీజేపీ ఉపాధ్యక్షులు రామకృష్ణ చౌదరి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష

కౌతాళం, జూలై 31(ఆంధ్రజ్యోతి):ఎస్సీ ఎస్టీ కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరి నిందితులకు జైలు శిక్ష ఖరారైనట్లు కౌతాళం సీఐ అశోక్ కుమార్ తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని కుంబళనూరు గ్రామానికి చెందిన మాదిగ మారెప్ప పై 2018లో ఇదే గ్రామానికి చెందిన సత్యనారాయణ, సతీష్ కుమార్‌లు కులం పేరుతో దూషిస్తూ దాడి చేసినట్లు అప్పట్లో కేసు నమోదైనట్లు తెలిపారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరి నిందితులపై జడ్జి శ్రీవాసు నిందితులిద్దరికి ఒక్కొక్కరికి నాలుగు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానం విధించినట్లు సీఐ అశోక్ కుమార్ తెలిపారు.

కౌన్సిల్ మీట్ రసాభాస


వాగ్వాదానికి దిగిన సభ్యులు

ఎమ్మిగనూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం రసాభాసగా సాగింది. గురువారం ఛైర్మన్ రఘు అధ్యక్షతన నిర్వహించారు. బీజేపీ సభ్యుడు దయాసాగర్ పలు సమస్యలను ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్తుండగా.. 22వ వార్డు వైసీపీ సభ్యుడు తమ వార్డులో సమస్యలు ఉన్నాయని అడ్డుకోవటంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరగింది. వైసీపీ సభ్యుడికి మద్దతుగా 1వ వార్డు సభ్యుడు నాగేశప్పతో పాటు వైస్‌ఛైర్మన్ నజీర్ మాట్లాడటంతో సమావేశంలో గందరగోళం ఏర్పడింది. వైస్‌ఛైర్మన్ నజీర్ మాట్లాడేలోపు టీడీపీ సభ్యులు ఇసాక్, వాహీద్, అమాన్, స్వాతి తమకు మాట్లాడే అవకాశం ఇవ్వాని వాదించటంతో సమావేశంలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. టీడీపీ సభ్యుడు ఇసాక్ కలుగచేసుకొని బీజేపీ సభ్యుడు దయాసాగర్‌కు కౌన్సిల్‌లో ప్రత్యేక సీటు ఏర్పాటు చేయాలని, ఆయన తమ ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డిని కలువలేదని అలాంటప్పుడు కౌన్సిల్‌లో ఆయనకు మద్దతు ఎలా ఇస్తామన్నారు. దీంతో వీరిమధ్య వాగ్వాదం జరిగింది. అజెండాలో పెట్టిన అంశాల్లో 16, 17 అంశాలు మినహా అన్నింటిని సభ్యులు ఆమోదించారు. సమావేశం ప్రారంభంలో 1వ వార్డు కౌన్సిలర్ నాగేశప్ప, మరో కౌన్సిలర్ శివప్రసాద్ మాట్లాడుతూ సోమప్ప సర్కిల్‌లో 100 అడుగుల జాతీయ జెండా ఏర్పాటు చేయటం వల్ల మాచాని సోమప్ప పేరు కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. టీడీపీ, బీజేపీ సభ్యులు మాట్లాడుతూ దీనిపై అనవసరంగా రాద్ధాంతం చేయొద్దన్నారు.

మున్సిపల్ ఛైర్మన్‌ను పలు సమస్యలపై సొంత పార్టీ సభ్యులు కేశవరెడ్డి, బజారి, కాశీం బేగ్, వైస్‌ఛైర్మన్ దివ్యకళ నిలదీశారు. అలాగే పలు సమస్యలపై టీడీపీ సభ్యులు ఏకరువు పెట్టారు. సభ్యుల ప్రశ్నలకు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సమాధానం ఇస్తూ ఈ మూడేళ్ల కాలంలో రూ. 30కోట్లతో రోడ్లు వేసినట్లు, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రూ. 5కోట్లతో రోడ్లు, డ్రైన్‌లు పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. వారంలోపు గాంధీనగర్, వెంకటాపురంలో తాగునీటి సమస్యను పరిష్కరించటంతో పాటు కలుగొట్ల రోడ్డు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుటామన్నారు. అలాగే గోనేగండ్ల బైపాస్ రోడ్డులో డ్రైన్, రోడ్డుపనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గోశాల ఏర్పాటుకు 8ఎకరాల స్థలంను సబ్ కలెక్టర్ గుర్తించారని, అది కేటాయిస్తే గోశాల ఏర్పాటు చేస్తామన్నారు. డీఈ నీరజ, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.